తుడా చేతికి 'శెట్టిపల్లె ఫైల్స్'

- అందరికీ ఇళ్లు పథకం కింద రెండు సెంట్లు కేటాయిస్తూ జీవో జారీ

తిరుపతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'శెట్టిపల్లె ఫైల్స్' తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తిరిగి తుడాకు బదలాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శెట్టిపల్లె అభివృద్ధి బాధ్యత తుడా చేతికి అప్పగించడంతో పాటు అందరికీ ఇళ్లు పథకం కింద 1.5 సెంట్లు కంటే తక్కువ ఉన్నవారుకూడా 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం (జీవో నెం:328) ఉత్వర్వులు జారీచేసింది. శెట్టిపల్లె వివాదానికి ఫుల్‌స్టాప్ పెడుతూ ఇటీవల జరిగిన మంత్రిమండలి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఆమేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం శెట్టిపల్లెను అభివృద్ధి చేసే బాధ్యతను తుడాకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. శెట్టిపల్లె బాధితుల్లో 961 మంది ప్లాట్ల యజమానులకు 15-18 అంకణాలే వచ్చింది. వీరందరికీ 2 సెంట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

గతంలో తుడాను పక్కన పెట్టి : తుడా పరిధిలోఉన్న శెట్టిపల్లెను గత వైసీపీ పెద్దలు మూడురోజుల్లోనే నగరపాలక సంస్థ పరిధిలోకి తీసుకొచ్చేశారు. 2021 సెప్టెంబరు 28వ తేదీన శెట్టిపల్లె భూసమస్యపై అప్పటి ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి రెవెన్యూ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లో విలీనానికి పంచాయతీ తీర్మానం కావాలని సూచించారు. ఆ మరుసటి రోజే (29వ తేది) శెట్టిపల్లె పంచాయతీలోని శెట్టిపల్లె, శెట్టిపల్లె హరిజనవాడ, సీఆర్ఎస్ క్వార్టర్స్, ఉప్పరపాళెం, వినాయకనగర్‌లను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కోరుతూ పంచాయతీ తీర్మానం జరిగింది. 30వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో శెట్టిపల్లె విలీనం తంతు పూర్తిచేశారు.

హలో.. ఐయామ్ రోడ్ డాక్టర్



రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలంటే ఇకపై మనుషులతో పనిలేదు. 'రోడ్ డాక్టర్' పేరిట తిరుపతి నగరపాలక సంస్థకు వచ్చిన ఓ వాహన యంత్రం నిమిషాల్లో గుంతలను పూడ్చేస్తోంది. బుధవారం నగరంలోని పలు రోడ్లపై ఏర్పడిన గుంతలను ఈ యంత్రం సాయంతో పూడ్చారు. ఈ యంత్రం పనితీరును కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. దీనిని సుమారు రూ1.5 కోట్లతో కొన్నామన్నారు. నూతన టెక్నాలజీతో సిద్ధం చేసిన రోడ్ల డాక్టర్ యంత్రం ద్వారా ఎప్పటికప్పుడు గుంతలను పూడ్చేందుకు అవకాశం ఉందన్నారు. సీసీ రోడ్లు, తారు రోడ్లు పూడ్చేందుకు దీనిని వినియోగిస్తారన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్లగా జిల్లాలో యూరియా కొరత లేదని, రబీ సీజన్ అక్టోబరు 15 నుంచి ప్రారంభమవుతుందని, ఇందుకు గాను 60వేల మెట్రిక్ టన్నులు అవసరముంటుందని పేర్కొన్నారు. 2023లో 30వేల మెట్రిక్ టన్నుల యూరియా రాగా 24,744మెట్రిక్ టన్నులు అమ్ముడు అయినట్లు తెలిపారు. 2024లో 27,595 మెట్రిక్ టన్నులు రాగా 19,738 మెట్రిక్ టన్నులు అమ్ముడుపోయిందని వెల్లడించారు. 2025కు సంబంధించి 30,623 మెట్రిక్ టన్నులు రాగా 28వేల మెట్రిక్ టన్నులు అమ్ముడు అయినట్లు వివరించారు. రబీ సీజన్‌కు కూడా యూరియా కొరత లేదని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 95శాతం కోతలు పూర్తయినట్లు పేర్కొన్నారు.

- తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆంధ్రజ్యోతి

'పింక్ డైమండ్' కథ కంచికి

- మైసూర్ మహారాజు సమర్పించిన హారంలో వున్నది రూబీ మాత్రమే
- సాక్ష్యాలతో నిరూపించిన ఆర్కియాలజిస్టు మునిరత్నం రెడ్డి



మైసూరు మహారాజు హారంపై వివాదం నేపథ్యంలో రూబీ అంటూ టీటీడీ విడుదల చేసిన ఫొటో



ఆభరణాలను మాజీ న్యాయమూర్తులు తనిఖీ చేస్తున్న సమయంలో తీసిన మైసూరు మహారాజు సమర్పించిన హారం ఫొటో

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పింక్ డైమండ్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. మైసూరు మహారాజు శ్రీవారికి సమర్పించిన హారంలో డైమండ్ లేదని, రూబీలు, కొన్ని రత్నాలు మాత్రమే అమర్చినట్టు కొన్ని సాక్ష్యాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో రాజకీయ విమర్శలతో పింక్ డైమండ్ వ్యవహారం పెద్దఎత్తున చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ప్రభుత్వాన్ని, టీటీడీని ఇబ్బందుల్లోకి నెట్టేలా అప్పట్లో వైసీపీ చేసిన ప్రచారం అసత్యమని తేల్చిచెప్పేలా కొన్ని ఆధారాలను ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి బయటపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

1945లో హారం బహూకరించిన మైసూరు మహారాజు

శ్రీవారికి విలువైన ఆభరణాలు బహూకరించిన రాజుల్లో మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ కూడా ఒకరు. 1945 జనవరి 9వ తేదీన ఆయన శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. మహారాజ పర్యటనకు సంబంధించి మైసూరు ప్యాలెస్ నుంచి 1944 డిసెంబరు 29వ తేదీన రామయ్య అనే ప్యాలెస్ అధికారి టీటీడీ కమిషనర్‌కు లేఖ రాశారు. రైలు ద్వారా 1945 జనవరి 9న ఉదయం 8 గంటలకు రేణిగుంటకు చేరుకునే మహారాజు తిరుపతి, శ్రీకాళహస్తి రాకపోకలకు రెండు మంచి కార్లను ఏర్పాటు చేసేందుకు సహకరించాలంటూ ఆ లేఖలో కోరారు. ఈ సందర్భంలోనే టూర్ షెడ్యూల్ కాపీని కూడా పంపారు.ఈ పర్యటనలోనే మైసూరు మహారాజు శ్రీవారికి హారాన్ని సమర్పించారు.ఆ హారాన్ని టీటీడీ కొన్నేళ్లుగా విశేష ఉత్సవాల సమయంలో ఉత్సవమూర్తులకు అలంకరిస్తోంది.2001 అక్టోబరు 21న జరిగిన గరుడసేవలో మలయప్పస్వామికి ఈ హారాన్ని అలంకరించారు. అయితే వాహనసేవను వీక్షిస్తున్న భక్తులు విసిరిన నాణేలు తగలడంతో ఆ ఆభరణంలో కెంపు రాయి విరిగిపోయింది. ఆ విషయాన్ని తిరువాభరణం రిజిస్టర్‌లో కూడా నమోదు చేశారు.



మైసూరు మహారాణి ప్రమోదదేవితో మునిరత్నంరెడ్డి

> స్వామివారి విషయాల్లో లేనిపోని అభాండాలు వేయకూడదు. తప్పుడు ప్రచారాలు చేస్తే మూల్యం చెల్లించాల్సిందే. మా పరిశోధనలో రాజు సమర్పించిన హారంలో డైమండ్ లేదని తేలింది. దేవాలయాల విషయాల్లో రాజకీయాలు చేయడం సరికాదు.
>
> - మునిరత్నం రెడ్డి

జెనీవాలో వేలం వేశారన్న రమణదీక్షితులు

మైసూరు మహారాజు శ్రీవారికి సమర్పించిన హారంలో ఉన్నది కెంపు రాయి కాదని, కోట్ల విలువైన పింక్ డైమండ్ అని, ఆ డైమండ్‌ను అపహరించి జెనీవాలో జరిగిన వేలంలో విక్రయించారంటూ 2018లో తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అలాగే కైంకర్యాలు సరిగా జరగడం లేదని, నిధుల కోసం ఆలయంలో తవ్వకాలు నిర్వహించారని కూడా ఆయన ఆరోపణలు చేయగా టీటీడీ కూడా అదే స్థాయిలో స్పందించింది. రమణదీక్షితులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ఈ విషయంపై జగన్నాధరావు కమిటీ ఇచ్చిన నివేదికలో పగిలిన కెంపు ముక్కలు పేష్కార్ ఆధీనంలో ఉన్నాయని తెలియజేసినట్టు వివరణ ఇచ్చింది.ఆ కెంపు విలువ రూ.50గా నిర్ధారించినట్టు రికార్డులున్నాయంటూ రమణదీక్షితుల ఆరోపణలను కొట్టిపడేసింది. అయితే స్వామికి అనేక ఏళ్లు దగ్గరుండి కైంకర్యాలు నిర్వహించిన రమణదీక్షితులు చెప్పడంతో పలువురు భక్తులు సందేహంలో పడ్డారు.

గతంలోనూ మాజీ న్యాయమూర్తుల తనిఖీలు

శ్రీవారి ఆభరణాల భద్రతపై గతంలో కూడా విమర్శలు వచ్చాయి. రాయల వారిచ్చిన ఆభరణాలతో పాటు మరికొన్ని ఆభరణాలు మాయమయ్యాయంటూ ఆరోపణలు రావడంతో 2009 సెప్టెంబరు నెలలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాధరావు నేతృత్వంలో ఓ కమిటీ, 2010లో జస్టిస్ వాద్వా నేతృత్వంలో మరో కమిటీని ఏర్పాటు చేశారు.టీటీడీ విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదికతో పాటు అధికారుల వద్దనున్న తిరువాభరణాల రిజిస్టర్‌ను వాద్వా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ఆభరణాలు సక్రమంగానే ఉన్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేసింది. జగన్నాథరావు కమిటీ కూడా 1952 నుంచి ఉన్న రికార్డుల ప్రకారం ఏ ఆభరణం మిస్ కాలేదని నివేదికలో పేర్కొంది. కాగా ఆభరణాల భద్రత, వివరాలను పొందుపరచడంలో ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించింది. శ్రీకృష్ణదేవరాయలు సమర్పించిన కానుకల వివరాలు టీటీడీకి అప్పజెప్పినప్పటికీ తిరువాభరణాల లిస్ట్‌లో లేవని తేల్చిచెప్పారు.2001బ్రహోత్సవాల్లో పగిలింది కెంపు మాత్రమేనని, భక్తులు నాణేలు విసిరినప్పుడు అది విరిగిందని రమణదీక్షితులే గుర్తించినట్టు ఆ నివేదికలో ఉంది.కెంపు స్థానంలో వెంటనే ఓ పగడం కూడా తిరిగి అమర్చినట్టు కమిటీ వివరించింది.

వెలుగులోకి డైమండ్ కాదని సాక్ష్యాధారాలు

మైసూరు మహారాజు సమర్పించిన హారంలో పింక్ డైమండ్ అనేది లేదని పలు సాక్ష్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. మైసూరులోని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్(ఎపిగ్రఫీ) మునిరత్నం రెడ్డి ఈ అంశంపై కొద్దిరోజుల పాటు పరిశోధన చేశారు. మైసూరు మహారాణి ప్రమోద దేవిని కలవడంతో పాటు ప్యాలెస్‌లోని కొన్ని రికార్డులను పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో ఆ హారాన్ని రూ.8,500కు ఢిల్లీలో తయారు చేయించినట్టు తేలింది. ప్యాలెస్‌లోని ఆభరణాల రికార్డుల్లోనూ శ్రీవారికి సమర్పించిన హారంలో ఎలాంటి డైమండ్ ఉన్నట్టు లేదు. దీంతో గతంలో చేసిన విమర్శలు తాజా ఆధారాలతో అవాస్తవాలుగా తేలాయి.

రూ.200 కోట్లకు జరిమానా

భక్తుల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు టీటీడీ ప్రతిష్టను దిగజార్చేలా వ్యాఖ్యలు చేసిన రమణదీక్షితులు, వైసీపీ అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డిపై రూ.200 కోట్ల పరువు నష్టం దావాను టీటీడీ వేసింది. దీనికి రూ.2 కోట్లు ఫీజు కూడా అప్పటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం చెల్లించింది.వైసీపీ అధికారం లోకి వచ్చాక ఆ కేసును ఉపసంహరించుకోవడంతో కోర్టుకు చెల్లించిన రూ.2 కోట్ల ఫీజు ఎవరిస్తారని, స్వామి నిధులు ఇలా దుబారా చేస్తారా అంటూ భారీగా విమర్శలొచ్చాయి. అయితే అంతకుముందు నానాయాగీ చేసి, భక్తుల్లో అనేక సందేహాలు రేకెత్తించిన వారంతా సమాధానమివ్వకుండా తేలుకుట్టిన దొంగల్లా మౌనంగా ఉండిపోయారు.

కదిలొచ్చిన పోలేరమ్మ



- వైభవంగా అమ్మవారి ఉత్సవ ఊరేగింపు
- భక్తుల దర్శనార్థం ఆలయం వద్ద నిలువుదల
- నేటి వెంకటగిరి జాతరకు సర్వం సిద్ధం







పుట్టినింట అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు - పూలతో అమ్మవారి ముఖాలంకరణ - అమ్మవారి ఆర్చి వద్ద భక్తుల కోసం క్యూలైన్

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుట్టిల్లయిన కుమ్మరి ఇంట బుధవారం రాత్రి రూపుదిద్దుకున్న పోలేరమ్మ ఊరేగింపుగా కదిలొచ్చారు. జాతర సందర్భంగా గురువారం భక్తులకు దర్శనం ఇవ్వడానికి ఆలయం వద్ద కొలువుదీరనున్నారు. వెంకటగిరి జాతరలో భాగంగా బుధవారం పోలేరమ్మ పుట్టినింట అమ్మవారి పీఠానికి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు పీఠంపై అమ్మవారి ప్రతిమను (కళ్లు, దిష్టి చుక్క లేకుండా) తయారు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పుట్టినింట కొలువుదీరిన అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో వేగంగా కదలాలంటూ పోలీసులు నెట్టగా భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అర్ధరాత్రి 12గంటలకు సప్పరంపై అమ్మవారిని అధిష్ఠింపచేసి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటకు తీసుకొచ్చారు. ఇక్కడ ఆచార సంప్రదాయాలతో అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క ఏర్పాటు చేసి పూర్తి అలంకారం చేశారు. అక్కడ్నుంచి దివిటీల వెలుగుల్లో ఆసాదుల తప్పెట్లు, యువత చిందులు, కేరింతల నడుమ అమ్మవారి ఊరేగింపు మొదలైంది. ప్రతి ఇంటి ముంగిట అమ్మవారికి కోళ్లు, మేకలను బలిచ్చారు. దీంతో రోడ్లు ఎర్రగా మారాయి. గురువారం తెల్లవారుజామునకు ఆలయం వద్ద వేప మండలతో వేసిన మండపంలో అమ్మవారు కొలువుదీరనున్నారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ సందర్భంగా భక్తులు వేయి కళ్ల దుత్తలతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఆ తర్వాత ట్రాక్టర్‌పై అమ్మవారిని ఊరేగింపుగా విరూప మండపానికి తీసుకెళ్లి ప్రతిమను ముక్కలు చేయడంతో జాతర ముగియనుంది.

చిన్నారుల మడి భిక్షాలు

'పోలేరమ్మకు మడిబిక్షం పెట్టండి. పోతురాజుకు టెంకాయ్ కొట్టండి. పగలక పోతే మానెత్తిన కొట్టండి' అంటూ వేపమండలు, పసుపు, కుంకుమలతో అలంకరించిన వెదురు బుట్టలు, స్టీలు గిన్నెలను చేత బట్టి ఇల్లిల్లూ తిరుగుతూ మొక్కుగా భిక్షాటన చేశారు. ఆ భిక్షాటన ద్వారా వచ్చే బియ్యంతో కుడుములు చేసి అమ్మవారికి నైవేద్యం పెడతారు.



జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

జాతర సందర్భంగా అమ్మవారి దేవస్థానం వద్ద పోలేరమ్మను భక్తులు దర్శించుకొనేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు పరిశీలించారు. 8 మంది డీఎస్పీలు, 60 మంది సీఐలు, 110మంది ఎస్ఐలతో పాటు కానిస్టేబుల్, ప్రత్యేక దళాలు.. మొత్తంగా వెయ్యి మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్కిట్ కళాశాలలో అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధంగా పునఃప్రారంభమైన శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ దేవేంద్రరెడ్డి కోరారు. ఈ ఏడాది నుంచి జేఎన్‌టీయూ అనుబంధంగా ప్రారంభం కానున్న స్కిట్ కళాశాలలో రెండో దశ వెబ్ కౌన్సెలింగ్‌లో అడ్మిషన్ల ప్రక్రియ జరిగిందన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి మిగిలిన సీట్ల కోసం మూడో దశ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. వివరాల కోసం 98480 16733 నెంబరులో సంప్రదించాలని కోరారు.

స్వామి సేవకు రెండోసారి

టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్ సింఘాల్



కాలినడకన వస్తున్న సింఘాల్

తిరుమల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర స్వామి సేవకు రెండోసారి టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ ఈవోగా, బోర్డు మెంబర్ సెక్రటరీ ఎక్స్ అఫిషియోగా బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రెండోసారి ఈవోగా రావడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. 2017మే నుంచి 2020అక్టోబరు వరకు మూడేళ్ల నాలుగు నెలలు సేవలు అందించానని చెప్పారు. 1994నుంచి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వస్తున్నానని చెప్పారు. ఈవోగా కాకుండా సామాన్య భక్తుడిగా క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్న సందర్భాలున్నాయన్నారు. బ్రహ్మోత్సవాల్లోని గరుడసేవను కూడా సామాన్యుడిగా దర్శించానని, తనకు సామాన్య భక్తుల ఇబ్బందులు తెలుసన్నారు. దేవాలయ పవిత్రతను కాపాడేందుకు, సాధారణ భక్తులకు న్యాయం చేసేందుకు టెక్నాలజీపై దృష్టి పెడతామన్నారు. టీటీడీ అధికారులు ఎంతో చిత్తశుద్ధితో రాత్రింబవళ్లు కృషి చేసి ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారన్నారు.శ్రీవారి సేవకుల సేవలు మరింత విస్తరించే దిశగా ఆలోచనలు చేస్తున్నామన్నారు.భక్తుల సూచనలు స్వీకరించి టీటీడీ సేవలు మెరుగుపరుస్తామన్నారు.

కాలినడక, తలనీలాల సమర్పణ

ఈవోగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం ఉదయం 5.05 గంటలకు అలిపిరి మార్గంలో కాలినడకను ప్రారంభించి 8 గంటలకు చేరుకున్నారు. మార్గంమధ్యలో కొందరి భక్తులతో మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకోవడంతో పాటు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. ఎలాంటి విషయాల్లో చర్యలు తీసుకోవాలనే ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అనంతరం తిరుమలలో తలనీలాలు సమర్పించి ఆలయంలోకి వెళ్లారు.

సర్వీసు రోడ్డులో ప్రమాదాలతో ఆందోళన

● స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డు, లైట్లు లేక ఇబ్బంది


చంద్రగిరి హైవే సర్వీసు రోడ్డు

చంద్రగిరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల పరిధిలో సీ.మల్లవరం జంక్షన్ నుంచి గాదంకి టోల్‌ప్లాజా వరకు ఇరువైపుల సుమారు 20కి పైగా గ్రామాలున్నాయి. వీరంతా హైవే సర్వీసులో రాకపోకలు సాగిస్తుంటారు. ఈరోడ్డులో స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డు, విద్యుద్దీపాలు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్తగా వచ్చే వాహనదారులు ఎక్కువగా వీటి బారిన పడుతున్నారు. రెండు రోజుల క్రితం తొండవాడ సమీపంలో సర్వీసు రోడ్డులో కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓవ్యక్తి మృతి చెందాడు.తక్షణం జీబ్రా లైన్స్, హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. లేకుంటే సర్వీసు రోడ్డుపైకి వెళ్లాలంటే భయంగా ఉందని శానంబట్లకు చెందిన వెంకటముని ఆందోళన వ్యక్తం చేశారు.

నానో యూరియా వినియోగంపై అవగాహన


మాట్లాడతున్న వ్యవసాయ అధికారి ధనలక్ష్మి

భాకరాపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను ఉపయోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం రైతు సేవా కేంద్రంలో నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వినియోగించుకోవాలన్నారు. ఎకరాలకు అర లీటరు నానో యూరియా మాత్రమే స్ప్రే చేయాలని, దాని ధర రూ.220 మాత్రమేనన్నారు. అలాగే ఎకరాకు అర లీటరు డీఏపీ స్ప్రే చేసుకోవచ్చునని, ధర రూ.250మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగచంగము నాయుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చు


కేకేవీపురంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలు, కిశోర బాలికలు పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చని అంగన్‌వాడీ పర్యవేక్షకులు జ్యోతి, మనీలా, రేవతి అన్నారు. కేకేవీపురం, కుప్పంబాదూరు ఉన్నతపాఠశాల్లో బుధవారం మిషన్‌శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికల్లో పోషకాహారలోపం, క్యాన్సర్ నివారణ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపైయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికల్లో హిమోగ్లోబిన్ తగ్గడం, పౌష్టికాహరం లోపం, విటమిన్ 12 లోపించడం వల్ల రుతక్రమంలో ఎక్కువ రక్తస్రావం అవుతుందన్నారు. వైద్యాధికారి పూర్ణిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్వీయూ విద్యార్థుల క్షేత్ర పర్యటన



సొరకాయాలపాళెంలో ర్యాలీ

రామచంద్రాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సామాజిక శాస్త్ర విభాగం పీజీ విద్యార్థుల సారథ్యంలో బుధవారం సొరకాయలపాళెంలో గ్రామీణ విస్తరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంతోపాటు సమీప ప్రాంతాల్లో సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు హరిశంకర్, ఉపాధ్యాయుడు రాజేంద్ర, ప్రొఫెసర్ డాక్టర్ జానకిరామయ్య, అధ్యాపకులు కుసుమ, అకడమిక్ కన్సల్టెంట్ వెంకటేశ్వర్లు, ముకుందనాయుడు, రమణయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చంద్రగిరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంఈవోలు లలిత కుమారి, భాస్కర్‌బాబులు సూచించారు. బుధవారం ఐతేపల్లె ఉన్నత పాఠశాలలో శక్తి ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. ఈక్రమంలో సర్పంచ్ ఫాజిల్లా, ఎంపీటీసీ శేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య, పోషణ, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎంఈవోలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ సుజాత, ఐసీడీఎస్ ఉషారాణి, హెచ్‌ఎం జయరామ నాయుడు, పంచాయతీ కార్యదర్శి సుజాత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆసక్తి పెంచుకోవాలి


కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

పాకాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాస్త్రసాంకేతిక రంగాల్లో విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని వీవీఎం సమన్వయ కర్త వెంకటసిద్దులు కోరారు. మొగరాల జడ్పీహైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు విద్యార్థి విజ్ఞాన మంథన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో అక్టోబరు, నవంబరు నెలల్లో ఆరు నుంచి పదవ తరగతి విదార్థులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షలకు సిద్ధం కావడానికి బ్రోచర్, పోస్టర్, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను మెరుగైన భావి శాస్త్రవేత్తలుగా తయారు కావడానికి శిక్షణ అందిస్తారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సుమలత, ఉపాధ్యాయులు సుల్తాన్, ఆదికేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుపల్లి మోడల్ స్కూల్ తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

రామచంద్రాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో మార్కండేయనాయుడు అన్నారు. అనుపల్లిమోడల్ స్కూల్‌ను బుధవారం ఆయనతోపాటు, ఉపాధ్యాయ బృందం తనిఖీ చేసింది. విద్యార్థులు ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పలు రకాల విషయాలపై పరీక్షలు నిర్వహించారు. సౌకర్యాలను ఉపయోగించుకుని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలన్నారు. మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఓజిలివాసి మృతి

రేణిగుంట సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... తిరుపతి కాటన్ మిల్లు వెనక వైపు ఓ వ్యక్తి మృతి చెందిపడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరు కున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలిం చారు. మృతుడు ఓజిలి మండలం సంగు టూరుకు చెందిన వెంకటేశ్వర్లు(35)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు.

చంద్రగిరి

నైపుణ్యాలతో ఉన్నతోద్యోగాలు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాష్‌రెడ్డి

తిరుపతిరూరల్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి):చదువుతోపాటు నైపుణ్యాలను పెంచుకుంటే ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించగలరని బైరాగిపట్టెడలోని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ ఫైనలియర్ విద్యార్థులకు నిర్వహించిన ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ శిక్షణా తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో వనరులను వినియోగించుకుని ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలు సాధించాలని సూచించారు. ట్రైనర్ యశ్వంత్ నేతృత్వంలో శిక్షణా తరగుతులు నిర్వహించారు. ఛైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఆలయాలకు పాదయాత్ర


ప్రతాప్ స్వామిజీ

రామచంద్రాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవాళి శ్రేయస్సు, ప్రకృతి పునరుద్ధరణ, గోసంతతి అభివృద్ధి కాంక్షిస్తూ ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ ఆలయాలకు పాదయాత్ర చేస్తున్నారు.ఈ ప్రస్థానం బుధవారం నాటికి వెయ్యి కిలోమీటర్లకు చేరుకుంది. ఈయన ఈఏడాది జూలై 10న పల్నాడు జిల్లా వినుకొండ సమీపంలోని విఠరంరాజుపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఎన్నో పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. ఈక్రమంలో ఆయన బుధవారం మహారాష్ట్రలోని త్రయంబకేశ్వరం చేరుకున్నారు. మరో రెండు నెలల్లో హిమాలయాలకు చేరుకుంటానని ఆయన ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో తెలిపారు.

'సూర్యఘర్'పై అవగాహన పెంచండి

● ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య


సబ్‌స్టేషన్ వద్ద గురవయ్య తదితరులు

పెనుమూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య పిలుపునిచ్చారు. పెనుమూరులో బుధవారం సాయంత్రం సబ్‌స్టేషన్‌ను ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ తనిఖీ చేసి, అనంతరం అక్కడ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై సోలార్ అమర్చుకునేవిధంగా వినియోగదారులను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రోత్సాహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ సురేష్‌కుమార్, డీఈలు చంద్రబాబు, శేషాద్రిరెడ్డి, ఏఈ తులసీ ప్రసాద్, లైన్‌మెన్‌లు ప్రభాకర్‌రెడ్డి, పద్మనాభనాయుడు, రాజేంద్రరెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

డివైడరును ఢీకొన్న కారు నలుగురికి గాయాలు

రేణిగుంట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): డివైడరును కారు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. బుధవారం మధ్యాహ్నం నగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ క్లర్క్ దినేష్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి నుంచి పుత్తూరుకు వెళ్తుండగా గాజులమండ్యం పాత పోలీస్ స్టేషన్ వద్ద డివైడరును ఢీకొన్నాడు. ఈ ఘటనలో దినేష్ తీవ్రంగా గాయపడగా, కుటుంబీకులకు స్వల్పగాయ్యాయి. స్థానికులు గుర్తించి వారిని ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాల మాటున దాగి కాటేసిన పాము

డిగ్రీ కళాశాల ఉద్యోగికి అస్వస్థత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుస్తకాల మాటున నక్కిన పాము గ్రంథాలయ ఉద్యోగిని కాటువేసింది. ఈ ఘటన శ్రీకాళహస్తి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల లైబ్రరీలో బుధవారం జరిగింది. కళాశాల లైబ్రరీలో రామయ్య ఉద్యోగి. బుధవారం పుస్తకాలను సర్దుతుండగా చేతిపై పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. సహచర సిబ్బంది ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన పుట్టాలమ్మ జాతర

రేణిగుంట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కట్ట పుట్టాలమ్మ జాతర నాగ హారతితో ముగిసింది. బుధవారం రెండో రోజు పుట్టాల మ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం ఆలయం నుంచి నాగపడగను మేళా తలాలతో దొడ్లమెట్లకు ఊరేగించారు. ఆలయ వంశపారంపర్యులు పడకకు ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం అక్కడినుంచి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం నాగపడగను అమ్మవారికి హారతి సమర్పించ డంతో జాతర ముగిసింది.

తిరుమలలో అపచారాలు జరుగుతూనే ఉన్నాయి: భూమన

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్‌నాయుడు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తిరుమలలో ఏదో ఒక అపచారాలు జరుగుతూనే ఉన్నాయని భూమన కరుణాకర్‌రెడ్డి బుధవారం ఆరోపించారు. చంద్రగ్రహణం రోజున మహాద్వారం మూసివేశాక ఇత్తడిగ్రిల్ గేటు తాళాలను ఆయన సంస్థకు చెందిన వారు వేస్తున్నట్లుగా ఉందని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

కల్యాణ వెంకన్న హుండీ ఆదాయం

నారాయణవనం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కించారు. 75 రోజులకు రూ.12,30,805 భక్తులు సమర్పించినట్టు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

చెరువుల్లో నీరు లేక తగ్గిన వరిసాగు



చింతగుంట పంచాయతీలో బీడుగా మారిన మంగమ్మ చెరువు భూములు- రబ్బరు చెట్లతో నిండి ఎండిన పకిరోణి చెరువు

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాభావ పరిస్థితులతో ఈసారి వరిసాగు విస్తీర్ణం తగ్గింది. ఖరీఫ్‌లో 244 చెరువుల కింద 3,114 ఎకరాల్లో వరి సాగు చేసేవారు. వరుణుడు ముఖం చాటేయడంతో చెరువుల్లో ఆశించిన మేర నీరు చేరలేదు. ఎర్రావారిపాలెం,చిన్నగొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి మండలాల్లో వర్షపాతం చాలా తక్కువ నమోదైంది. ఎర్రావారిపాలెం మండలంలో ఆరేడు చెరువుల్లో మాత్రమే నీరు ఉంది. ఫలితంగా ఐదు శాతం భూముల్లో కూడా వరి సాగు కాలేదు. పశుపోషణ, వ్యవసాయమే ఇక్కడ జీవనాధారం. వరి సాగు తగ్గడంతో కూలీలకు పనులు దొరకడం లేదు. చింతగుంట, నెరబైలు, కూరపర్తివారిపల్లె, కోటకాడపల్లె, ఉస్తికాయల పెంట గ్రామాల చెరువులు అటవీ సరిహద్దులో ఉన్నాయి. శేషాచల అడవుల్లో కురిసిన వర్షాల నీరు ఈ గ్రామాల చెరువులకు తొందరగా చేరుతుంది. ఈపర్యాయం ఈ చెరువులు కూడా ఎండిపోయాయి. పశువులకు తాగునీటికి బోరు బావులే ఆధారం. అక్టోబరు,నవంబరు నెలల్లో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతోనైనా చెరువులు నిండకపోతాయా అని రైతులు ఎదురుచూస్తున్నారు. లేకుంటే భూగర్భ జలాలు అటుగంటి వేసవిలో నీటి ఎద్దడి ఎదురవుతుందని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క బోరుబావుల కింద నాటిన జిలకర, చింటు రకం ధాన్యం ధరలు బాగానే ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 75 కేజీల బస్తా రూ.3వేల వరకు ధర పలుకుతోంది. నాణ్యతతో కూడిన ధాన్యం దిగుబడి వస్తోంది.

టీటీడీ ఛైర్మన్‌ను కలిసిన సింఘాల్



తిరుమల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవోగా బుధవారం బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ సింఘాల్ అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈవోను ఛైర్మన్ శాలువాతో సత్కరించారు. అనంతరం టీటీడీకి సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

టీటీడీ ఉద్యోగులకు కృతజ్ఞతలు: శ్యామలరావు



టీటీడీ ఈవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన మాజీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. తనకు విధి నిర్వహణలో సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. 14 నెలల కాలంలో తిరుమలలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. వచ్చే 25 ఏళ్లపాటు స్వామివారి అన్నప్రసాదం, లడ్డూప్రసాదం నాణ్యత విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనకు వీడ్కోలు పలికారు. అలాగే శ్యామలరావు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడునికి మర్యాదపూర్వకంగా కలిశారు. తన పదవీకాలంలో సహకరించినందుకు ఛైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు శ్యామలరావును ఛైర్మన్ శాలువాతో సత్కరించి శ్రీవారి ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు.

ఉపాధి పనుల్లో క్షేత్ర సహాయకుల చేతివాటం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలో ఉపాధి హామీ పనుల్లో క్షేత్రసహాయకుల చేతివాటం మరోసారి బయట పడింది. గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.948.49 లక్షల పనులకు సం బంధించి ఎస్‌ఆర్‌పీ లోకేష్ ఆధ్వర్యంలో 13 మంది డీఆర్‌పీల బృందం మండలంలో పది రోజులుగా గ్రామాల్లో విచారణ చేపట్టింది. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీ డీవో ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ ప్రజా వేదికలో డ్వామా పీడీ శ్రీనివాస్ ముందు విచారణ నివేదికను తనిఖీ బృందం ఉంచింది. విచారణలో మంచానికి పరిమితమై ఫించన్ పొందుతున్న వారు, వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల పేరు మీద మస్టర్లు సృష్టించి, వేతనాలు చెల్లించి నిధులు దు ర్వినియోగం చేసినట్లు గుర్తించారు. చిన్నపాండూరులో మంచానికి పరిమితమైనట్లు ధృవీకరణ పత్రాలు పొంది నెలకు రూ.15వేలు ఫించన్ పొందుతున్న వారు ఉపాధి పనులు చేస్తున్నట్లు గుర్తించి పీడీ విచారణకు ఆదేశించారు. కళత్తూరు పంచాయతీలో కంపెనీలకు వెళ్లే కార్మికులు ఉపాధి పనులకు హాజరయినట్లు మస్టర్లు సృష్టించారు. అదే గ్రామంలో రెవెన్యూ సిబ్బంది ఉపాధి పనులు చేసినట్లు ఉండడం గుర్తించారు. తనిఖీల్లో వెలుగు చూసిన వివిధ అవకతవకలపై ఉపాది సిబ్బంది నుంచి రూ.1.30 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. పలువురు సిబ్బందికి రూ.26 వేలు అపరాధం విధించారు. కార్యక్రమంలో ఏపీడీ సరిత, ఎస్టీఎం కోనయ్య, ఎస్‌ఆర్‌పీ లోకేశ్ పాల్గొన్నారు.

చంద్రప్రభలో పార్వతీసుతుడి వెలుగులు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో బుధవారం రాత్రి వినాయకస్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కాణిపాకం, చినకాంపల్లె, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, తిరువణంపల్లె, బొమ్మసముద్రం, అగరంపల్లె, పుణ్యసముద్రం, ఎగువ,దిగువమారేడుపల్లెలు, సంతపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె, కారకాం పల్లె గ్రామాలకు చెందిన హరిజనులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో కాణిపాకంలో కలశ ఊరేగింపును ఘనంగా నిర్వహించాక మూల విగ్రహానికి అభిషేకాన్ని నిర్వహించారు. దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ జి.కేశవులు కుటుంబ సభ్యులతో కలసి వరసిద్ధునికి బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. రాత్రి స్వామికి ఉభయవరస రావడంతో కల్యాణ వేదిక వద్ద స్వామి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుని ఉత్సవ విగ్రహాలను చంద్రప్రభ వాహనంపై ఉంచి కాణిపాక పురవీధుల్లో భాజాభజంత్రీల నడుమ ఊరేగించారు. బుధవారం ఉదయం సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు యూరియా



దొరవారిసత్రం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలకు టన్నుల కొద్దీ యూరియా సరఫరా అవుతోంది. ఇటీవల జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ మండలంలో పర్యటించిన సమయంలో వరి సాగు చేసే రైతులు ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. రబీ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని నెలబల్లి రైతుసేవా కేంద్రానికి 52 టన్నుల యూరియా లారీల్లో వచ్చింది. దానిని స్థానిక గోదాములో నిల్వచేశారు. మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

పోలేరమ్మ జాతరలో కట్టుదిట్టమైన భద్రత: ఎస్పీ


పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్నఎస్పీ హర్షవర్ధన్ రాజు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. బుధవారం ఆయన స్థానిక పోలేరమ్మ గుడి, కుమ్మరి ఇళ్లు, సాకలి ఇళ్లు, రాజా వీధి, పాత బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. క్యూలైనులో భక్తుల మధ్య తోపులాట లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ కంట్రోల్ పాయింట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీవీఐపీలకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు, వారి వాహనాలు పార్కింగ్ గురించి సూచలు చేశారు. అమ్మవారి జాతరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వస్తున్నారని, వారికి బందోబస్తుతో అమ్మవారి దర్శనం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, వెంకటగిరి సీఐ రమణ, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే రాజాకుటుంబీకులు, ఏపీఏ మాజీ ఛైర్మన్ స్వర్ణయాచేంద్ర జాతర ఏర్పాట్లు పరిశీలించారు. ఆర్చి సెంటర్, అమ్మవారి పుట్టినిల్లు, మెట్టినిల్లు, క్యూలైన్‌లను పరిశీలించారు. ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఛైర్మన్ మురళీకృష్ణలకు సూచనలు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో

కుటుంబం ఆత్మహత్యాయత్నం

● ఇద్దరి మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం


కృష్ణగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి, కీర్తిక - రిజర్వాయర్ నుంచి ఈతగాళ్లు వెలికి తీస్తున్న లక్ష్మణమూర్తి, శారదమ్మాళ్ మృతదేహాలు

కుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):కుప్పం పట్టణానికి చెందిన ఓ కుటుంబం తమిళనాడు రాష్ట్రంలో జిల్లా కేంద్రమైన కృష్ణగిరి సమీపంలో వున్న కేఆర్‌బీ డ్యాంలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు నలుగురిలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం మేరకు ..... లక్ష్మణమూర్తి (50) కుటుంబం కుప్పం పట్టణం కొత్తపేట జయప్రకాశ్ రోడ్డులో నివాసముంటోంది. టీ బంకుతో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబంలో లక్ష్మణమూర్తి అత్త శారదమ్మాళ్ (75), భార్య జ్యోతి (45), కుమార్తె కీర్తిక (20) సభ్యులుగా ఉన్నారు. నలుగురు సభ్యులతో కూడిన ఈ కుటుంబం బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి ఎవరికీ చెప్పకుండా కృష్ణగిరి వెళ్లింది. కేఆర్‌బీ డ్యాంలో చిన్న స్లూయిస్ గేటు వద్దకు వచ్చిన వీరంతా హఠాత్తుగా డ్యాంలోకి దూకారు.డ్యాం దిగువభాగంలో చేపలు పట్టుకుంటున్న జాలరులు గమనించి వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే ఇద్దరు మహిళల్ని మాత్రమే రక్షించగలిగారు.లక్ష్మణమూర్తి కుటుంబం మొత్తం రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యాయత్నం చేసిందన్న సమాచారం అక్కడి పోలీసుల ద్వారా కుప్పంలో ఉన్న వారి బంధువులకు అందింది. ఈ దుర్ఘటనలో లక్ష్మణమూర్తితోపాటు ఆయన అత్త శారదమ్మాళ్ మృతి చెందారు. ఆయన భార్య జ్యోతి, కుమార్తె కీర్తికలను మత్స్యకారులు గమనించి బయటకు తీసుకు వచ్చారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని చికిత్స నిమిత్తం స్థానిక పోలీసులు కృష్ణగిరి ఆసుపత్రిలో చేర్చారు. సమాచారం అందుకున్న కృష్ణగిరి డ్యాం పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను వెలికి తీసి, పోస్టుమార్టం కోసం కృష్ణగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో లక్ష్మణమూర్తి కుటుంబం ఆత్మహత్యా యత్నం చేసినట్లు చెబుతున్నారు.ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో బంధువర్గంతోపాటు కొత్తపేట మొత్తం శోకసంద్రమైంది. కృష్ణగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ భూములకు ప్రొసీడింగ్స్ ఇవ్వండి

కలెక్టర్‌కు శెట్టిపల్లి రైతుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శెట్టిపల్లి రైతులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 30 ఎకరాల భూమికి ప్రొసీడింగ్స్ వెంటనే మంజూరు చేయాలని శెట్టిపల్లికి చెందిన కొందరు రైతులు బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ప్లాట్స్‌ను శెట్టిపల్లి గ్రామానికి ఉత్తరం, చెరువుకు తూర్పుగా కేటాయించాలన్నారు. అవి కూడా ప్లాట్స్ రూపంలో ఇవ్వాలని, ల్యాండ్ పూలింగ్ మినహా మిగిలిన భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. వారి సమస్యలను విన్న కలెక్టర్ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, కృష్ణమూర్తి, చెంచయ్య, దామోదరం, మునిరాజ, జయకుమార్, మునిరత్నం, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కు ఘన స్వాగతం



పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న రాజారెడ్డి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం సాయంత్రం సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభకు హాజరయ్యేందుకు వచ్చిన జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. సభా ప్రాంగణం వద్ద పార్టీ తిరుపతి నగరాధ్యక్షుడు రాజారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు.

శేషాద్రినగర్‌లో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ మధుశేఖర్

తిరుచానూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీ శేషాద్రినగర్‌లో రోడ్డు నిర్మాణానికి బుధవారం సింగిల్‌విండో చైర్మన్ చెరుకూరి మధుశేఖర్, టీడీపీ నేతలు మునికృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. రోడ్డు లేక శేషాద్రినగర్ కాలనీ వాసులు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకురావడంతో నిధులు విడుదల చేయించారు. పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సురేంద్రనాయుడు, కళావతి, నవీన్, శేషాద్రి, భాగ్యలక్ష్మి, రెడ్డెమ్మ, శివ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క నిమిషం ఆలోచిస్తే ఎన్నో సాధించవచ్చు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడే ముందు ఒక్క నిమిషం ఆలోచిస్తే విలువైన ప్రాణాలను నిలబెట్టుకోవడమేగాక జీవితంలో ఎన్నో విజయాలు సాధించవచ్చని రుయా సూపరింటెండెంట్ రాధ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా రుయాస్పత్రిలోని మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రుయాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎంతటి సమస్యకైనా పరిష్కార మార్గాలు ఉంటాయని, మానసికంగా దృఢంగా ఉండాలని అన్నారు. మానసిక వైద్య విభాగాధిపతి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా 18 నుంచి 35 ఏళ్లలోపు వారే ఉన్నారని, చెడు వ్యసనాలకు బానిసలైనప్పుడు ఇలాంటి ఆలోచనలు వస్తాయని, ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్తు వ్యసన నిర్మూలన కేంద్ర వైద్యాధికారిణి మానస, వైద్యులు కిశోర్, కవిత, జాహ్నవి, భారతి, కౌన్సెలింగ్ సైకాలజిస్టులు మురళి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

'పవన్ ఫొటో చూసినా వైసీపీకి వణుకు'



మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటో చూసినా వైసీపీ నేతల వెన్నులో వణుకుపుడుతోందని జనసేన నేత కిరణ్‌రాయల్ విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నేతల్లో ఏమాత్రమూ మార్పు లేకపోవడం బాధాకరమన్నారు. ఇటీవల ఓ విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రశాంత జీవితం గడపకుండా పవన్‌కల్యాణ్ సినిమాల్లో నటించకూడదని కోర్టులో పిటిషన్ వేసి భంగపడ్డారన్నారు. తాజాగా మరో వ్యక్తి పవన్ ఫొటో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండకూడదని కోర్టును ఆశ్రయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చిల్లర పనులు మాని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రేపు కళాకారులకు పురస్కారాల ప్రదానం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహతి ఆడిటోరియంలో ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే రాయలసీమ రంగస్థలి నృత్య కళోత్సవంలో కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కెఎన్.రాజా తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పేరుతో ఈ పురస్కారాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రంగస్థలి 35వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ నృత్య కళోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



వాసవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ జువాలజీ పరిశోధకురాలు కె.వాసవి 'ఇన్వెస్టిగేషన్ ఆఫ్ బయోజెనిక్ సిల్వర్ నానోపార్టికల్స్ అగినెస్ట్ మల్టీడ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా స్ట్రైన్స్ ఐసోలేటెడ్ ఫ్రం హాస్పిటల్ ఎన్విరాన్‌మెంట్ అండ్ దైర్ జెనెటిక్ బార్‌కోడింగ్' అంశంపై పరిశోధన పూర్తి చేశారు. ప్రొఫెసర్ రాజశేఖర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 16 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ఇటీవల చేపట్టిన తనిఖీల్లో వీరిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

ఘనంగా సంకటహర చతుర్థి



వినాయకుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినాయకసాగర్ సమీపంలోని సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ పురోహితులు సురేష్‌స్వామి, ఉభయదారులు జ్యోతీశ్వరనాయుడు, విజయ, ఆలయ ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథ సత్యనారాయణ జయంతి



విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : తిరుపతి దక్షిణ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో బుధవారం బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి ఆధ్వర్యంలో కవి సార్వభౌమ విశ్వనాథ సత్యనారాయణ 108వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విశ్వనాథ సత్యనారాయణ 20వశతాబ్దపు తెలుగు రచయిత, కవి సామ్రాట్ బిరుదాంకితులని గుర్తుచేసుకున్నారు. బ్రాహ్మణ సొసైటీ, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటలు తప్పవని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి అన్నారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికీ రూ.15వేలు ఇస్తామని, ఆటోల కొనుగోలుకు బ్యాంకు రుణాలు అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు శివ, వాసు, ఐఎఫ్‌టీయూ నేత విజయ్‌కుమార్, ఆటో యూనియన్ నాయకులు పురుషోత్తంరెడ్డి, బాల, వెంకటేష్, సురేష్, ప్రమీల, బాదుల్లా పాల్గొన్నారు.

సమాజ హితం కోరేదే సాహిత్యం



పుస్తకాలను అవిష్కరిస్తున్న మేడసాని మోహన్ తదితరులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి) : సమాజ హితం కోరేదే సాహిత్యమని పంచసహస్రావధాని మేడసాని మోహన్ అన్నారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో బుధవారం విశ్రాంత అధ్యాపకుడు మన్నవ భాస్కర్ నాయుడు జయంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మన్నవ ముత్యాల సరాలు, కనకదుర్గా శతకం పుస్తకావిష్కరణ చేశారు. మేడసాని మోహన్ మాట్లాడుతూ తన గురువు మన్నవ భాస్కర్ నాయుడి ప్రోత్సాహంతో ముందుకు సాగానన్నారు. సభాధ్యక్షులు కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడమే కాకుండా సమాజ శ్రేయస్సును అకాంక్షించిన కవి, రచయిత మన్నవ భాస్కర్ నాయుడు అని కొనియాడారు. ప్రముఖ రచయితలు గాలి గుణశేఖర్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న మాట్లాడుతూ సమసమాజ అభ్యున్నతి, సరళమైన బాష, సమకాలీన సంఘటనలను ఇతివృత్తాలుగా తన సాహిత్యాన్ని అందించారని తెలిపారు. ఆచార్య బాలసుబ్రమణ్యం, జక్కంపూడి మునిరత్నం, తోట వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు నాయుడు, గంగవరం శ్రీదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జయరాం ప్రసాద్, మన్నవ గంగాధర ప్రసాద్, సాకం నాగరాజు, భూమన్, పేరూరు బాలసుబ్రమణ్యం, యువశ్రీ మురళి, అంకమ నాయుడు, తిరువాయిపాటి రాజగోపాల్, ఆకుల మల్లేశ్వరరావు, అమరేంద్ర, డాక్టర్ సుభద్ర, డాక్టర్ ఉమ, శోభ, ఉషారాణి, యువశ్రీ ప్రసాద్, రాచపూటి రమేష్, మోహన మునిసిద్దారెడ్డి, వాకా ప్రసాద్, బత్తుల రవి, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆత్మీయ సత్కారం



కలెక్టర్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు సామంచి శ్రీనివాస్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయకచవితి వేడుకలు, నిమజ్జనం విజయవంతం కావడంతో బుధవారం వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. నాట్యగణపతి చిత్రపటాన్ని బహూకరించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ నగరం, పరిసర ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలు, సామూహిక నిమజ్జనం మహోత్సవాలు విజయవంతం కావడానికి కలెక్టర్ ఎంతగానో సహకరించారన్నారు. వినాయకసాగర్‌లో నాట్యగణపతి విగ్రహం నెలకొల్పాలని కోరగా అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కరాటే శ్రీనివాస్, రఘురామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, అనిల్‌కుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా ఎస్పీ వైఖరి సరికాదు

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా ఎస్పీ వైఖరి సరిగా లేదని, తీరు మార్చుకోకపోతే ఉద్యమం తప్పదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రామానాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా కొరతపై రైతులు నిరసన తెలిపితే ఎస్పీ వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని పేర్కొన్నారు. గతంలోనూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తే విద్యార్థి నాయకులను కొట్టడమేగాక తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేశారని తెలిపారు. దీనిపై గవర్నర్‌కు, మానవ హక్కుల సంఘానికి, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు, రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

హరికథకు తగ్గని ఆదరణ

హెచ్‌డీపీపీ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్



సర్టిఫికెట్లు అందిస్తున్న రామ్ రఘునాథ్

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగీతం, సాహిత్యం, నాట్యకళల మేళవింపే హరికథ కళారూపమని, దానికి నేటికీ ప్రజాదరణ తగ్గలేదని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి రామ్ రఘునాథ్ పేర్కొన్నారు. శ్వేత భవనంలో పది రోజులుగా నిర్వహిస్తున్న హరికథ వైభవం శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సనాతన హైందవ ధర్మాన్ని సామాన్యులకు దగ్గర చేయడానికి హరికథ ఒక ఆయుధమన్నారు. సైద్ధాంతిక వైభవం గల టీటీడీ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. అదనపు కార్యదర్శి రామ్‌గోపాల్ మాట్లాడుతూ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు హరికథకు ఆద్యుడిగా నిలిచారని చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన 30 మంది మహిళా హరిదాసులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాలుగు పొట్టేళ్లు, రెండు మేక పిల్లల చోరీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో మంగళవారం రాత్రి నాలుగు పొట్టేళ్లు, రెండు మేక పిల్లలు చోరీకి గురయ్యాయి. రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు... తిరుపతి రూరల్ కుప్పరవాండ్లపల్లి గ్రామానికి చెందిన గంగయ్య పొట్టేళ్లు, మేకలు మేపుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మూడు ద్విచ క్ర వాహనాల్లో వచ్చిన దొంగలు నాలుగు పొట్టేళ్లు, రెండు మేక పిల్లలను తీసుకెళ్లారు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన గంగయ్య రూరల్ సీఐ చిన్నగోవిందుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ సాయిసుజాత



శిక్షణా కార్యక్రమంలో డైరెక్టర్ సాయిసుజాత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ సాయిసుజాత పేర్కొన్నారు. ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో అక్కారంపల్లెలో మహిళలకు ఉలన్‌తో తోరణాలు, హ్యాండ్ బ్యాగులు, పర్సులు, మొబైల్ పౌచ్‌లు, జడ బ్యాండ్‌లు, హ్యాంగర్స్ వంటి వాటి తయారీపై మహిళలకు వారం రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఆమె మాట్లాడుతూ మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. రిసోర్స్‌పర్సన్ సుభాషిణి, అక్కారంపల్లె పద్మావతి మహిళాభ్యుదయ సంఘం ఎండీ మురుగేష్, సీఈవో ధర్మేంద్రకుమార్ మాట్లాడుతూ ఆదాయ ఉత్పాదకత కోసం మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ అధ్యాపకులు రమణ, రాజరాజేశ్వరి, జగదీశ్వరి, సునీత, మహిళా సంఘ సభ్యులు సరస్వతి, శంకరి, సరోజమ్మ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు ఓరియంటేషన్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్‌లో కొత్తగా చేరిన విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, డీన్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు. యూనివర్సిటీలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

డేటా సైన్స్ సెంటర్ ప్రారంభం



డేటా సైన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డేటా సైన్స్ సెంటర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. ప్రఖ్యాత గణాంక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సీఆర్ రావు 105వ జయంతి సందర్భంగా ఐఎస్‌పీఎస్ డేటాసైన్స్ సెంటర్‌ను నలంద నగర్‌లో బుధవారం ఆయన ప్రారంభించారు. డేటా సైన్స్ సెంటర్ ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ప్రత్యేకించి విద్యార్థులకు అవసరమైన అవగాహనను అందించేందుకు దోహదం చేస్తుందని అన్నారు. మహిళా విద్యార్థుల కోసం డేటా సైన్స్ డిప్లొమో కోర్సు నిర్వహించాలనుకోవడం మంచి పరిణామమని తెలిపారు. అనంతరం సీఆర్ రావు సెమినార్ హాల్, స్టాటిస్టిక్స్ కన్సల్టెన్సీ సెల్, పీసీ మెహలనోబీస్ కంప్యూటర్ ల్యాబ్, సెల్ఫ్ స్టడీ లైబ్రరీ, రూఫ్ గార్డెన్‌ను కలెక్టర్ పరిశీలించారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, కోలకతా ఐఎస్ఐ మాజీ డైరెక్టర్ ప్రకాశరావు, ఐఎస్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో నుంచి ప్రయాణికులను దింపేసిన ఘటనపై విచారణ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి రాయదొరువుకు వెళ్లే బస్సులో నుంచి విశ్రాంత షార్ ఉద్యోగుల కుటుంబ సభ్యులను కండక్టర్ మార్గమధ్యంలో దింపేసిన ఘటనపై బుధవారం డిపో అధికారులు విచారణ చేపట్టారు. బాధితుల సమాచారం మేరకు.... ఈ నెల 1న విశ్రాంత షార్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు తులసి, సాయి శ్రీహరికోటకు వెళ్లేందుకు సూళ్లూరుపేట నుంచి రాయదొరువు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఎంతసేపటికీ కండక్టర్ టికెట్ కొట్టేందుకు రాకపోవడంతో కుదిరి స్టేజ్ దాటిన తరువాత అడిగారు. స్టేజీ దాటినా ఎందుకు టికెట్ తీసుకోలేదని కండక్టర్ ప్రశ్నించాడు. టికెట్ కొట్టేందుకు మీరెందుకు రాలేదని కండక్టర్‌ను ప్రయాణికులు అడగడంతో మార్గమధ్యంలో అటవీ ప్రాంతంలో బస్సును ఆపి తులసి, సాయిలను దింపేశారు. ఈ విషయం తెలుసుకున్న వారి బంధువులు అక్కడకు చేరుకుని ఆర్ఎంకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారించాలని డిపో అధికారులకు ఆర్ఎం ఆదేశించారు.

సీఆర్ రావు సేవలు చిరస్మరణీయం

ఎస్వీయూ వీసీ అప్పారావు



వీసీ అప్పారావును సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గణాంక శాస్త్రవేత్త సీఆర్ రావు వివిధ రంగాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్వీయూ వీసీ అప్పారావు అన్నారు. సీఆర్ రావు 105వ జయంతి సందర్భంగా సీడీ నాయుడు-ఆర్కాట్ లక్ష్మీకాంతమ్మ పేర బుధవారం యూనివర్సిటీలో చేపట్టిన ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్టాటిస్టిక్స్ విభాగానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ వీవీ రావు మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్‌లో గణాంక భావనలకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాట్స్ హెడ్ సరోజమ్మ, రిటైర్డు ప్రొఫెసర్లు బాలసిద్ధముని, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

బార్ లైసెన్స్ రాకపోవడంతో షాప్ మార్పునకు యత్నం

నిరసన తెలిపిన మహిళలు



నిరసన తెలుపుతున్న మహిళలు

తిరుపతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి వైకుంఠపురం ఆర్చి సమీపంలో ఉన్న విక్టరీ బార్ అండ్ రెస్టారెంట్ దగ్గర స్థానిక మహిళలు బుధవారం నిరసనకు దిగారు. ఇక్కడ వైన్‌షాపు వద్దంటూ నేలపై కూర్చుని నినాదాలు చేశారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బార్ టెండర్లలో విక్టరీ బార్‌కు దక్కలేదని తెలిసింది. దీంతో తిరుపతిలోని మరొక ప్రదేశంలో ఉన్న మద్యం షాపును బారున్న ప్రదేశంలోకి మార్పు చేస్తున్నారని తెలుసుకున్న స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్ పెట్టేటప్పుడు ఇలానే వాళ్లు నిరసన తెలిపారు. ప్రధాన రోడ్డులో ఉన్న బార్ వలన మహిళలు, విద్యార్థినీ విద్యార్థులు గతంలో చాలా ఇబ్బందులు పడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి ప్రదేశంలో మళ్లీ బ్రాందీ షాపును ఏర్పాటు చేసినట్లయితే నిరాహార దీక్ష చేస్తామని మహిళలు స్పష్టం చేశారు.





సంకటహర గణపతి వ్రతంలో పాల్గొన్న భక్తులు - క్షీరాభిషేకంలో ఉభయదారులు, భక్తులు

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

● స్వర్ణరథంపై మాడ వీధుల్లో ఊరేగిన వరసిద్ధుడు



ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో బుధవారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తుల చేత వైభవంగా నిర్వహింపజేశారు. ఉదయం మూల విరాట్‌కు వైభవంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. ఈ వ్రతాన్ని ఆచరిస్తే సర్వకష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అనంతరం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబికా కృష్ణ



శ్రీరామ్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ నిర్మాత అంబికా కృష్ణ, నటుడు శ్రీరామ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

భక్తులకు మెరుగైన సేవలపై ప్రత్యేక దృష్టి

● అధికారులకు ఈవో సింఘాల్ సూచన

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత సేవా దృక్పథంతో, మరింత బాధ్యతగా సేవలను అందిద్దామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్నమయ్య భవనంలో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఛైర్మన్, సభ్యులు, డయల్ యువర్ ఈవో, ఐవీఆర్ఎస్ తదితర మార్గాల ద్వారా భక్తుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. వీలైనంతవరకు టెక్నాలజీ సాయంతో మెరుగైన సేవలు కల్పించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు నాణ్యతగా ఉన్నట్టు భక్తులు చెప్పారన్నారు. విధానపరమైన నిర్ణయాల్లో ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమష్టిగా నిర్ణయం తీసుకుని వేగంగా సేవలు అందిద్దామన్నారు. అంతకుముందు వివిధ విభాగాల అధికారులు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఈవోకు వివరించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.07 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,828

తలనీలాలు సమర్పించినవారు: 26,296

ఇక డీలర్ల వద్ద నో వెయిటింగ్

● ఇప్పటికే ప్రజలకు స్మార్టు కార్డుల పంపిణీ

● డీలర్లకు ఈ-పోస్ మిషన్ల అందజేతకు ఏర్పాట్లు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో అవినీతి అక్రమాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఇప్పటికే తొలి విడతలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన అధికారులు తాజాగా ఆధునిక ఈ-పోస్ పరికరాలను అందజేయాలని నిర్ణయించింది. పాత మిషన్లలో రేషన్ కార్డు నంబరు నమోదు చేశాక కార్డుదారుని వేలి ముద్ర తీసుకునేవారు. దీనివల్ల పని ఆలస్యమయ్యేది. కార్డుదారులు ఇబ్బందిపడేవారు. ఇప్పుడు స్మార్ట్ కార్డుల్లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా,స్వైపింగ్ చేసినా డీలర్ల పని సులభమవుతోంది. వెంటనే కార్డులోని కుటుంబ సభ్యుల వివరాలు కనిపిస్తున్నాయి. ఈ-పోస్ పరికరం కూడా మొబైల్ ఫోన్‌లా పనిచేస్తుంది. ఇందులో సిమ్ కార్డు పెట్టి రీచార్జి చేస్తారు. తక్కువ బరువు ఉండడం వల్ల ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్ళవచ్చునని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు ఆంధ్రజ్యోతికి చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాలకు అందచేస్తున్న సరకుల వివరాలు, డీలర్ల వద్ద నిల్వలు తదితర వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చన్నారు.

అక్టోబరు రెండు నుంచి పూర్తి స్థాయిలో..

అక్టోబరు రెండు నుంచి పూర్తి స్థాయిలో రేషన్ దుకాణాల డీలర్లకు ఈ-పోస్ పరికరాలను పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాకు దాదాపు 1457 మిషన్లు వచ్చాయి. వీటిని డీలర్లకు అందచేసి వచ్చే నెల మొదటి వారం నుంచి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వంద మంది డీలర్లకు వీటిని అందచేశారు. సర్వర్, పరికరాల ద్వారా సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు జాగ్రత్తలు పడుతున్నారు.



యువకుడి దారుణహత్య



రహీద్‌బాషా(ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న రహీద్‌బాషా అలియాస్ మున్నా(35) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం స్థానిక గాంధీనగర్ సమీపంలోని శ్మశానం వద్ద రహీద్ బాషా రక్తపు మడుగులో పడి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ గీతాకుమారి సీఐలు శ్రీనివాస్, శేఖర్ బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రంపించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట రహీద్‌బాషా బంధువులు ఆందోళన చేపట్టారు. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మృతుడి బంధువులకు, పోలీసులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

మహిళా సాధికారత సదస్సు ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 14, 15న జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. హోటల్ తాజ్, గ్రాండ్ రిడ్జ్, హోటల్ సరోవర్‌లో అతిథుల బస కు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. సదస్సు నోడల్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్, తుడా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. జిల్లా పంచాయితీ అధికారి వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, తుడా ఈ.ఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్‌లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

రేపు టూరిజం ఇన్వెస్టర్స్ మీట్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని తాజ్ హోటల్‌లో శుక్రవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ ఆధ్వర్యంలో జరిగే ఈ మీట్‌లో రాష్ట్రంలో పర్యాటక రంగం బలోపేతం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా చర్చలు జరుపుతారని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించే రోడ్ మ్యాప్ రూపొందించనున్నట్లు తెలిపారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు, అనంతపురం, సత్యసాయి, కర్నూలు జిల్లాల నుంచి స్టేక్ హోల్డర్స్ పాల్గొంటారని వెల్లడించారు.

వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలి



కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వందశాతం లక్ష్యసాధనకు వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో తక్కువ ప్రగతి సాధించిన కేంద్రాల వైద్యాధికారుల నుంచి కారణాలు తెలుసుకుని అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. జననాల సంఖ్య పెంపు, టీకాలు పూర్తిచేయడం, మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధన జరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, వైద్యాధికారులు శైలజ, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, శాంతకుమారి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో పాల్గొనడం గొప్ప అవకాశం

- పద్మావతి వర్సిటీలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్ -



విజేతలతో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్‌లో పాల్గొనడం విద్యార్థులకు మంచి అవకాశమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీలో బుధవారం చేపట్టిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవాలని కోరారు. క్వాంటం కంప్యూటింగ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు ఉన్నాయన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పరిశ్రమలు-విద్యాసంస్థల భాగస్వామ్యంతో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా సాంకేతికత ఆధారంగా సామాజిక సమస్యల పరిష్కారంపై చేపట్టిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ వెంకటేశ్వర్, వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డీన్ వాణి, ఉన్నత విద్యామండలి ప్రతినిధి రోశయ్య, టీటీఐ సీఈవో సూర్యకుమార్ నగదు బహుమతులు అందజేశారు.

చెరువుల అభివృద్ధికి శ్రీకారం

● మరమ్మతులకు రూ.515 కోట్లతో ప్రతిపాదనలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 181 చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణం కోసం రూ.515.18 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చెరువుల పునరుద్ధరణపై సమావేశం నిర్వహించారు.



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కలెక్టర్ మాట్లాడుతూ 181 చెరువులను బాగుచేయడం ద్వారా 30,08,185 హెక్టార్ల ఆయకట్టుకు ప్రయోజనం లభించనుందని తెలిపారు. 33 కరువు ప్రభావిత మండలాలు లబ్ధి పొందనున్నాయన్నారు. స్లూయిజ్‌లు, సరఫరా చానల్స్ మరమ్మతులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, దేశీనాయక్, వెంకటేశ్వరప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఆహార భద్రతపై పారిశ్రామికవేత్తలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

మంగళం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతపై బుధవారం తిరుపతిలోని టీటీడీసీ సమావేశ మందిరంలో పారిశ్రామికవేత్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆహార పదార్థాలు తయారు చేయడంలో ఉపయోగించాల్సిన ముడి పదార్థాలను గుర్తించడం, వాటిని ఉపయోగించడంపై చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన 120మంది మహిళా పారిశ్రామికవేత్తలు శిక్షణ పొంది సర్టిఫికెట్లు అందుకున్నారు. కుప్పం నుంచి అత్యధికంగా 20మంది మహిళా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ ఆహార ఆధారిత పరిశ్రమలకు మిల్లెట్స్ ఫుడ్ ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యారిస్ హాన్ ట్రస్టు సభ్యురాలు శిరీష, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

13న బాక్సింగ్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని జీడీ హైస్కూల్లో ఈ నెల 13న జిల్లాస్థాయి అండర్ 14 బాలురు, అండర్ 17, 19 బాలికల బాక్సింగ్, బైరాగిపట్టెడ ప్రైవేటు క్రీడా ప్రాంగణంలో లాన్‌టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న వారు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు. హెచ్‌ఎం నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టుతో రావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9849159147, 9441891874 (బాక్సింగ్), 9700778867 (లాన్‌టెన్నిస్)లను సంప్రదించాలని కోరారు.

మద్యం తాగి విధులకు వాచ్‌మెన్లు

● కొందరు విద్యార్థులతోనూ తాగించిన వైనం?

● బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో కలకలం

తిరుపతిరూరల్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తామే కాకుండా కొందరు విద్యార్థులతోనూ ఇద్దరు వాచ్‌మెన్లు మద్యం తాగించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రుల తెలిపిన వివరాలిలా.. తాటితోపు వద్ద జ్యోతిబా పులే బీసీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ఉంది. 5-10తరగతులకు చెందిన 230మంది ఇందులో చదువుతున్నారు. ఇక్కడి ఇద్దరు వాచ్‌మెన్లు సాయంత్రం పూట మద్యం తాగి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల దీనిని కొందరు విద్యార్థులు గమనించారు. దీంతో ప్రిన్సిపాల్, టీచర్లకు ఫిర్యాదు చేయవద్దంటూ బెదిరించి వారితోనూ మద్యం మద్యం తాగించారని సమాచారం. విద్యార్థులు తర్వాత ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. వాచ్‌మెన్ల వ్యవహార శైలిపై గతంలోనూ చేసినా ప్రిన్సిపాల్, టీచర్లు పట్టించుకోనట్టు వ్యవహరించారని తల్లిదండ్రులు ఆరోపించారు. కాగా వాచ్‌మెన్లను ప్రిన్సిపాల్ పిలిచి మందలించి మొదటి తప్పుగా వదిలేశారని సమాచారం. ప్రిన్సిపాల్ గిరిధర్‌ని వివరణ కోరగా..పాఠశాలలో మద్యం బాటిళ్లు ఉంటే బయటపడేసి వాచ్‌మెన్లను మందలించామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరుగుతుందని వివరించారు.

నేడు కేంద్ర ఆర్థిక మంత్రి రాక

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం గురువారం తిరుపతికి రానున్నారు. మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ బస చేసి, శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు.శనివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రికి ఘన నివాళులు



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శాసనాల ద్వారా వెంకటేశ్వర స్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం కావడానికి కృషి చేసిన మహనీయుడు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి అని ప్రముఖ శాసన పరిశోధకుడు సొరకాయల కృష్ణారెడ్డి అన్నారు. అన్నమాచార్య కళామందిరంలో బుధవారం జరిగిన సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి వర్థంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి ఆలయ పేష్కారుగా ఉంటూ 1167 రాగిరేకుల శాసనాలను ఆయన సేకరించి అనువదించారన్నారు. అన్నమయ్య కీర్తనల భాండాగారం నుంచి చాలా రాగి రేకులను వెలికితీసినట్లు చెప్పారు. దేవస్థానం ఉద్యోగిగా మాత్రమే కాకుండా పురాతన వస్తు పరిశోధనా శాస్త్రవేత్తగా స్వామివారి వైభవాన్ని తొలిసారి ఎలుగెత్తిచాటిన ఘనత శాస్త్రికి దక్కిందన్నారు. సంస్కృత విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు శ్రీవారికి అందించిన అనేక విలువైన ఆభరాలను శాసనాల ద్వారా శాస్త్రీ ప్రపంచానికి తెలియజేశారన్నారు. పంచసహస్ర అవధాని మేడసాని మోహన్ కూడా మాట్లాడారు. అంతకు ముందు సుబ్రహ్మణ్యశాస్త్రి విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అలాగే ఎస్వీ ఓరియంటల్ కళాశాలలో గౌరిపెద్ది రామసుబ్బ శర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. శర్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న కార్తీక్ సాయి

ప్రకృతి ప్రయోజనకారులు పక్షులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణుల సహజ ఆవాసాలను నాశనం చేయకుండా చూడటం కనీస ధర్మమని వన్య ప్రాణి పరిశోధకులు కార్తీక్ సాయి పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ పక్షులు ప్రకృతికి మేలు చేస్తాయన్నారు. వీటిని గుర్తించడం, కాపాడటం, వివరాలను తెలుసుకోవడం లాంటివి చేయాలన్నారు. ఇందుకు ప్రకృతి ప్రేమికులు చొరవ చూపాలన్నారు. పక్షులకు సంబంధించిన వివరాలు భద్రపరచడానికి తాను ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..



యువతరం ఉత్సాహం..

పుత్తూరు వార్తలు

ఘనంగా గంగ జాతర

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని గేట్ పుత్తూరులో గంగ జాతర అత్యంత వేడుకగా సాగింది. అమ్మవారి సేవలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని గంగమ్మను వేడుకున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, నాయకులు గాలి జీవరత్నంనాయుడు, ఎస్.ఎస్.ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి



పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్రూరు గ్రామంలో వినాయక ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా జరిగిన సంకటహరి చతుర్థి పూజలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సదాశివేశ్వర ఆలయ హుండీ లెక్కింపు



పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయం, ఆరేటమ్మ ఆలయాల హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబర్ వరకు భక్తుల సమర్పించిన కానుకలను లెక్కించారు. ముందుగా ఆరేటమ్మ ఆలయంలో హుండీ లెక్కించగా రూ.1,07,769 ఆదాయం వచ్చింది. అలాగే మధ్యాహ్నం కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన లెక్కింపులో రూ.3,59,599 ఆదాయం చేకూరింది. సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలంలోని రామగిరి ఆలయ ఈవో హేమచంద్ర పర్యవేక్షణలో ఈవో జయకృష్ణ హుండీ లెక్కంపు ప్రక్రియ నిర్వహించారు. సదాశివేశ్వరా స్వామి ఆలయ చైర్మన్ దిలీప్ కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, విక్కీరాయల్, స్కౌట్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

నీట మునిగిన విద్యుత్ స్తంభాలను మార్చండి



ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఫిర్యాదు అందిస్తున్న సీపీఎం నాయకుడు

పుత్తూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం గూళూరు చెరువులో నీట మునిగిన విద్యుత్ స్తంభాలను మార్చి రైతులు, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీపీఎం నాయకుడు వెంకటేష్ కోరారు. పుత్తూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరిగింది. స్తంభాలను మార్చాలంటూ అదాలత్ చైర్మన్ విశ్రాంత జడ్జి శ్రీనివాస మూర్తికి ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో ఇళ్లపైన, పొలాల్లో తీగలు కింద వేలాడుతున్నాయని, స్తంభాలు తుప్పు పట్టాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదానీ స్మార్ట్ మీటర్లను తొలగించాలని కోరారు. 15 ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు. అదాలత్ సభ్యులు మధుకుమార్, విజయలక్ష్మి, డీఈ దేవ ఆశీర్వాదం, పుత్తూరు, నాగలాపురం ఏడీఈలు శంకరయ్య, రమేష్, ఏఈలు పాల్గొన్నారు.

సీఏతో ఉజ్వల భవిష్యత్తు

పుత్తూరు, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): బీకాం చదువుతున్నప్పుడే సీఏ కోర్సు మీద అవగాహన ఏర్పరచుకుని చార్టెడ్ అకౌంటెన్సీ పూర్తి చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీనివాసరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దేవకి, తిరుమలయ్య, లక్ష్మీబాయి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హాల్ మార్కు, ఐఎస్ఐలపై అవగాహన

పుత్తూరు,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వస్తువులు కొనుగోలుకు ధరతో పాటు హాల్ మార్క్, ఐఎస్ఐ మార్కు గుర్తులను చూడాలని వినియోగదారులను రూరల్ యాక్షన్ సంస్థ చిట్టిబాబు సూచించారు. స్థానిక మండల వెలుగు కార్యాలయంలో బుధవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ సౌజన్యంతో వెలుగు మహిళలకు హాల్ మార్క్, ఐఎస్ఐ మార్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారం, వెండి నగలపై హాల్ మార్కు, గృహోపకరణాలపై ఐఎస్ఐ గుర్తులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజ, హైమావతి, సోనీ, లావణ్య పాల్గొన్నారు.

పెండింగ్ భూములకు ప్రొసీడింగ్స్ ఇవ్వండి

కలెక్టర్‌కు శెట్టిపల్లి రైతుల వినతి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 30 ఎకరాల భూమికి ప్రొసీడింగ్స్ వెంటనే మంజూరు చేయాలని శెట్టిపల్లికి చెందిన కొందరు రైతులు బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ప్లాట్స్‌ను శెట్టిపల్లి గ్రామానికి ఉత్తరం, చెరువుకు తూర్పుగా కేటాయించాలన్నారు. అవి కూడా ప్లాట్స్ రూపంలో ఇవ్వాలని, ల్యాండ్ పూలింగ్ మినహా మిగిలిన భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. సమస్యలను కలెక్టర్ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నాలుగు పొట్టేళ్లు, రెండు మేక పిల్లల చోరీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో మంగళవారం రాత్రి నాలుగు పొట్టేళ్లు, రెండు మేక పిల్లలు చోరీకి గురయ్యాయి. రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు... తిరుపతి రూరల్ కుప్పరవాండ్లపల్లి గ్రామానికి చెందిన గంగయ్య పొట్టేళ్లు, మేకలు మేపుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన దొంగలు నాలుగు పొట్టేళ్లు, రెండు మేక పిల్లలను తీసుకెళ్లారు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన గంగయ్య రూరల్ సీఐ చిన్నగోవిందుకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్క నిమిషం ఆలోచిస్తే ఎన్నో సాధించవచ్చు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడే ముందు ఒక్క నిముషం ఆలోచిస్తే విలువైన ప్రాణాలను నిలబెట్టుకోవడమేగాక జీవితంలో ఎన్నో విజయాలు సాధించవచ్చని రుయా సూపరింటెండెంట్ రాధ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా రుయాస్పత్రిలోని మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రుయాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎంతటి సమస్యకైనా పరిష్కార మార్గాలు ఉంటాయని, మానసికంగా దృఢంగా ఉండాలని అన్నారు. మానసిక వైద్య విభాగాధిపతి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా 18 నుంచి 35 ఏళ్లలోపు వారే ఉన్నారని, చెడు వ్యసనాలకు బానిసలైనప్పుడు ఇలాంటి ఆలోచనలు వస్తాయని, ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్తు వ్యసన నిర్మూలన కేంద్ర వైద్యాధికారిణి మానస, వైద్యులు కిశోర్, కవిత, జాహ్నవి, భారతి, కౌన్సెలింగ్ సైకాలజిస్టులు మురళి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

అమ్మవారికి తాళిబొట్టు బహూకరణ



ఆలయ చైర్మన్, ఈవోలకు తాళిబొట్టు అందజేస్తున్న దాతలు

వెంకటగిరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతర సందర్భంగా పోలేరమ్మకు మొక్కు చెల్లింపులో భాగంగా అవ్వారు కృష్ణ దంపతులు 10గ్రాముల బంగారు తాళిబొట్టును అమ్మవారికి సమర్పించారు. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఈవో శ్రీనివాసులురెడ్డికి తాళిబొట్టును అందజేశారు.

జాతరలో ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ జాతర సందర్భంగా తిరుపతికి చెందిన అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. బుధ, గురువారం రెండు రోజుల పాటు జాతరలో భక్తులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తోటా కృష్ణయ్య, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరావు, గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌శక్తి సంకల్ప

చిల్లకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెట్టపల్లి, చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుకమ్మ మాట్లాడుతూ విద్యార్థినులకు వారి హక్కులు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, స్వీయ సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జ్యోతి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది ఇంద్రావతి, కమలమ్మ, పెంచలమ్మ, సుజాత, ప్రసన్న, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

తడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో విద్యార్థులకు మండలస్థాయి ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో ఆటల పోటీలను ఎంపీడీవో శేఖర్‌నాయక్ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మిటన్, చెస్, అథ్లెటిక్, యోగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు తెలిపారు.

రెవెన్యూ సహాయకుల సదస్సును విజయవంతం చేయండి

గూడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సదస్సును విజయవంతం చేయాలని వీఆర్ఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు బుధవారం కోరారు. వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 15న పట్టణంలో ప్రదర్శన నిర్వహించి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు.

ఊనుగుంటపాళెంలో బేటీ బచావ్.. బేటీ పడావో

కోట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెం ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో బేటీ బచావ్ - బేటీ పడావో కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత, ఆశ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు బాల్య వివాహాల నిర్మూలన, కౌమారదశలో బాలికలకు వచ్చే మార్పులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

వాకాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని ఛైర్‌పర్సన్ మర్రి ప్రమీల స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఏఎంసీ ఆదాయం, ఖర్చులు, తదితర అంశాలపై ఇన్‌చార్జి కార్యదర్శి ప్రసాద్‌రెడ్డిని వివరణ కోరామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ దువ్వూరు మధుసూదనరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో వైద్య శిబిరం

నాయుడుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం శ్రీనివాసపురంలో జ్వరాలు ప్రబలుతుండటంతో బుధవారం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి శంకరయ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, గిరిజన కాలనీలో స్థానికులకు జ్వరాలు రావడంతో హెచ్‌ఎం చంద్రయ్య, టీడీపీ నాయకులు, న్యాయవాది పనబాక గంగరాజు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందించారు. బుధవారం వైద్యాధికారి శంకరయ్య వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది జాకీర్ హుస్సేన్, శివకుమారి, గోపాల్, మంజుల, సుకన్య, దీపిక, సుప్రజ, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్ర సర్వేను వేగవంతం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణిరెడ్డి

కోట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్ర సర్వేను మరింత వేగవంతం చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాణిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పలు ప్రభుత్వ పథకాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం జరిగింది. గ్రామాల్లో సర్వే చేసే ముందు ఆస్తి హక్కు కల్పించే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోపాలు జరిగితే సంబంధిత సర్వే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున గ్రామాల్లో బ్లీచింగ్, పారిశుధ్యం, తాగునీటి పథకాలలో క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వేణు, మండల సర్వేయర్ గోపీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరలో కట్టుదిట్టమైన భద్రత: ఎస్పీ



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్నఎస్పీ హర్షవర్ధన్ రాజు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. బుధవారం ఆయన స్థానిక పోలేరమ్మ గుడి, కుమ్మరి ఇళ్లు, సాకలి ఇళ్లు, రాజా వీధి, పాత బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. క్యూలైనులో భక్తుల మధ్య తోపులాట లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ కంట్రోల్ పాయింట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీవీఐపీలకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు, వారి వాహనాలు పార్కింగ్ గురించి సూచలు చేశారు. అమ్మవారి జాతరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వస్తున్నారని, వారికి బందోబస్తుతో అమ్మవారి దర్శనం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, వెంకటగిరి సీఐ రమణ, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే రాజాకుటుంబీకులు, ఏసీఏ మాజీ చైర్మన్ స్వర్ణ యాచేంద్ర జాతర ఏర్పాట్లు పరిశీలించారు. ఆర్చి సెంటర్, అమ్మవారి పుట్టినిల్లు, మెట్టినిల్లు, క్యూలైన్‌లను పరిశీలించారు. ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఆలయ చైర్మన్ మురళీకృష్ణలకు సూచనలు చేశారు.

రైతు సేవా కేంద్రాలకు యూరియా



నెలబల్లి రైతు సేవా కేంద్రానికి యూరియా తీసుకొచ్చిన లారీ

దొరవారిసత్రం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలకు టన్నుల కొద్దీ యూరియా సరఫరా అవుతోంది. ఇటీవల జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ మండలంలో పర్యటించిన సమయంలో వరి సాగు చేసే రైతులు ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. రబీ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని నెలబల్లి రైతుసేవా కేంద్రానికి 52 టన్నుల యూరియా లారీల్లో వచ్చింది. దానిని స్థానిక గోదాములో నిల్వ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

ఉపాధి కూలీల బకాయిల విడుదల

తడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఉపాధి కూలీల బకాయిలు మంజూరు అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మే నెల 15నుంచి ఉపాధి కూలీల వేతనాలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. నాలుగు నెలలు అవుతున్నా పట్టించుకోలేదు. గత నెలరోజులుగా ఉపాధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం రూ.1668 కోట్ల బకాయిలను విడుదల చేసింది. బుధవారం నుంచి కూలీల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. కాగా, తడ మండలంలో సుమారు రూ.3.33 కోట్ల బకాయిలు ఉండగా, దొరవారిసత్రంలో 1.65 కోట్లు, నాయుడుపేటలో రూ.2.37 కోట్లు, పెళ్లకూరులో రూ.94 లక్షలు, ఓజిలిలో రూ.2.10 కోట్లు, సూళ్లూరుపేట మండలంలో రూ.2.14 కోట్లతో కలిపి నియోజకవర్గంలో మొత్తం రూ.12.54 కోట్ల బకాయిలు ఉన్నాయి.

విశ్వనాథ సత్యనారాయణ జయంతి



విశ్వనాథ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డును అందుకున్న విశ్వనాథ సత్యనారాయణ ఎన్నో నవలలు, గ్రంథాలు రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనసూయ, ప్రజేంద్రరెడ్డి, లీల, నాగభూషణమ్మ, రవీంద్ర, వసుంధర, చిన్నారావు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ రాయభారం



ఈశ్వరుడు, దేవేంద్రుడి ఉత్సవమూర్తుల ఊరేగింపు

చిట్టమూరు, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణ రాయభారం వైభవంగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున షణ్ముఖస్వామి కల్యాణం నిర్వహించిన పండితులు మధ్యాహ్నం కల్యాణ రాయభారము కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. ఈశ్వరుడు, దేవేంద్రుల ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించారు. మల్లాం గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ రాయభార ఘట్టాలను ప్రదర్శించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మావుడూరు వెంకటాచలపతి అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. దేవదానం, భాస్కర్ రెడ్డి, బాలరాజు, గంగయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పైపులైన్ కోసం విచ్చలవిడిగా రోడ్ల తవ్వకాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్యాస్ పైపులైన్ కోసం విచ్చలవిడిగా రోడ్లను తవ్వేస్తున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుంద అన్నారు. బుధవారం పట్టణంలో రోడ్ల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రణాళికాబద్ధంగా గ్యాస్‌పైపు లైన్ అమర్చాల్సి ఉండగా, ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేపడుతున్నారని, ఇందువల్ల తాగునీటి పైపులైన్లు దెబ్బతింటున్నాయన్నారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడితే సరైన సమాధానం చెప్పలేదని,ఇ దీనిపై నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు.

ఆర్టీసీ బస్సులో నుంచి ప్రయాణికులను దింపేసిన ఘటనపై విచారణ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి రాయదొరువుకు వెళ్లే బస్సులో నుంచి విశ్రాంత షార్ ఉద్యోగుల కుటుంబ సభ్యులను కండక్టర్ మార్గమధ్యంలో దింపేసిన ఘటనపై బుధవారం డిపో అధికారులు విచారణ చేపట్టారు. బాధితుల సమాచారం మేరకు... ఈ నెల 1న విశ్రాంత షార్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు తులసి, సాయి శ్రీహరికోటకు వెళ్లేందుకు సూళ్లూరుపేట నుంచి రాయదొరువు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఎంతసేపటికీ కండక్టర్ టికెట్ కొట్టేందుకు రాకపోవడంతో కుదిరి స్టేజ్ దాటిన తరువాత అడిగారు. స్టేజీ దాటినా ఎందుకు టికెట్ తీసుకోలేదని కండక్టర్ ప్రశ్నించాడు. టికెట్ కొట్టేందుకు మీరెందుకు రాలేదని కండక్టర్‌ను ప్రయాణికులు అడగడంతో మార్గమధ్యంలో అటవీ ప్రాంతంలో బస్సును ఆపి తులసి, సాయిలను దింపేశారు. ఈ విషయం తెలుసుకున్న వారి బంధువులు అక్కడకు చేరుకుని ఆర్ఎంకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారించాలని డిపో అధికారులకు ఆర్ఎం ఆదేశించారు. బుధవారం ఆర్టీసీ సూపర్‌వైజర్ సురేష్ ఆ ప్రాంతానికి వెళ్లి బాధితులను కలిసి జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు.

ఉనికి కోసమే వైసీపీ ఆరాటం: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓటు రూపంలో ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీలో మార్పు రాలేదని, ఎరువుల కొరత లేకపోయిన ఉనికి కోసం అన్నదాత పోరుబాట చేపట్టడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎరువుల కొరత పేరుతో పార్టీ నాయకులను వెనుకవేసుకుని నిరసన చేపట్టడం తగదన్నారు. జిల్లాలో అవసమైన మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. కిలివేటి వ్యవసాయం గురించి తెలుసుకోవాలని, మన ప్రాంతంలో ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదని, అలాంటప్పుడు ఎరువుల కొరత ఎక్కడ వస్తుందన్నారు. వైసీపీకి నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లి సమస్యలపై చర్చించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాల్, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, రైతు సేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, గాడి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం భారతి

గూడూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపయోగపడే ఉపకరణాలను ప్రభుత్వం ఉచితంగా అందజేసేందుకు నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన ఉపకరణాలను గుర్తించడం జరిగిందన్నారు. శిబిరంలో 120మంది విద్యార్థులు పాల్గొన్నారని, వీరికి త్వరలోనే ప్రభుత్వం ఉపకరణాలను అందజేసేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ శిబిరాన్ని డీవైఈవో సనత్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవోలు రవీంద్రబాబు, కాంచన, రవూఫ్, వైద్యసిబ్బంది ప్రియ, శివకుమార్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఇలాగేనా: డీపీవో

పెళ్లకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం డీపీవో సుశీలాదేవి పర్యటించారు. శిరసనంబేడు గ్రామంలో చెత్త సేకరణ, ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య, ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకు, చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ శిరసనంబేడు, అనకవోలు పంచాయతీలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యం, చెత్త సేకరణలో వెనుకబడడంపై సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ హిట్ సభకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

తడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం జరిగిన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, ఏఎంసీ డైరెక్టర్ ఏకాంబరం, టీడీపీ నాయకులు సెల్వం, పళని, జయపాల్, సుధాకర్, తదితరులు బహిరంగసభకు తరలివెళ్లారు. సభా ప్రాంగణంలో మంత్రి సవిత, మహిళా ఎమ్మెల్యేలు పరిటాల సునీత, భూమా అఖిలప్రియతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సందడి చేశారు.



మంత్రి సవిత, మహిళా ఎమ్మెల్యేలతో నెలవల విజయశ్రీ

క్రీడల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయండి

టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ పిలుపు


టేబుల్‌టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో సత్తా చాటి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలు ర ఉన్నత పాఠశాలలో బుధ వారం జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్- 14, 17, 19 విభాగాల్లో సాఫ్ట్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... క్రీడలు శారీరక ఉత్తేజంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. విద్యార్థులు ఏ క్రీడలో రాణిస్తున్నారో గుర్తించి అందుకు తగిన విధంగా ప్రోత్సహించాలని పీఈటీలను ఆయ న కోరారు. 450మంది క్రీడాకారులు పాల్గొనగా విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపా ధ్యాయుడు వెంకటయ్య, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు భార్గవి, కిషోర్, పీడీలు వెంకటముని, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పేరుతో రైతులను వేధించొద్దు


మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం అమ్మచెరువు గ్రామంలో రైతులను రీసర్వే పేరుతో వేధించవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... జగన్ ఫొటోలను తొలగించడంతో ఉన్న శ్రద్ధ రైతుల సమస్యలు పరిష్కరించడలో కూటమి ప్రభు త్వానికి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రీసర్వే జరిగిన గ్రామాల రైతుల సమస్యలు ప్రత్యేకంగా శ్రద్ధవహించి పరిష్క రించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని గ్రామాల రైతులతో కలిసి ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెం బరు 10 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు పౌష్టికాహారం తీసు కుంటే ఆరోగ్యంగా ఉంటారని సత్య వేడు సీడీపీవో దేవకుమారి తెలిపారు. బీఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో -బేటీ పఢావో కార్యక్రమంపై కిశోర బాలికలకు బుధవారం అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఆమె లింగ వివక్ష, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, విద్య, ఆహారం, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, హెచ్‌ఎం రమణయ్య, ఉపాధ్యాయులు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు యమున, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేవైసీ, బీమాపై అవగాహన


అవగాహన సభలో మాట్లాడుతున్న బషీర్

కేవీబీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):బ్యాంకుల ద్వారా ప్రజలకు ఎన్నో ఉపయో గపడే కార్యక్రమాలను ఆర్‌బీఐ నిర్వ హిస్తోందని ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ చెప్పారు. పట్ట ణంలోని సంతమైదానంలో బ్యాంకు ఖాతాదారులకు కేవైసీ, బీమాపై అవగాహన క ల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవైసీ ద్వారా ఖాతా వివరాలతో పాటు, నామినీ, ఖాతాదారుడికి వర్తించే పాలసీలను తెలుసుకో వచ్చన్నారు. దీని ద్వారా మీ ఖాతా మోసగాళ్ల బారిన పడకుండా బ్యాంకులు రక్షిస్తాయన్నారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీఎం ఇందిరాగాంధీ, ఆర్‌ఎం ప్రకాష్, ఎంపీడీవో తరుణాక్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట వేసే ముందు మట్టి పరీక్షలు తప్పనిసరి


మట్టిని ఎలా సేకరించాలో వివరిస్తున్న పరమేశ్వరి

కేవీబీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మట్టి పరీక్షల ద్వారా సంబంధిత నేలకు సరి పోయే పంటలు, మొక్కలు, పండ్ల తోటలు తెలుసుకోవచ్చని భూసార పరీక్షా కేంద్ర వ్యవసాయాధికారి పరమేశ్వరి చెప్పారు. పంట వే సేముందు మట్టి పరీక్షలు తప్పని సరిగా చేయాల్సి ఉందన్నారు. పీ ఎంఆర్‌కేవీవై పథకం కింద కేవీబీపురం ఆదర్శ పాఠశాలలో 8, 9, ఇంటర్ మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు మట్టి నమూనా సేకరణ పద్ధతులను ప్రయోగా త్మకంగా వివరించారు. కేవీబీపురం ఏవో మురళీకృష్ణ, సహాయకులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ నర్సరీలో చిన్మయ విద్యార్థుల సందడి



సత్యవేడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన యాత్రలో భాగంగా చిన్మయ విద్యా లయ విద్యార్థులు బుధవారం శ్రీసిటీ నర్సరీని సందర్శించి, సందడి చేశారు. 2వ తరగతికి చెందిన 100 మంది విద్యార్థులు విచ్చేయగా శ్రీసిటీ ఉద్యాన అధికారి పవన్‌కుమార్ వారికి నర్సరీలోని మొక్కలు, వాటి విశిష్టతలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నర్సరీ ఆవరణలోని ప్రసన్న వేంకటేశ్వ రాలయాన్ని సందర్శించారు. విద్యార్థులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన భగవద్గీత పారాయ ణాన్ని శ్రద్ధగా ఆలకించారు. విద్యార్థుల సందర్శనకు అనుకూలంగా అన్ని వసతులు సమకూర్చి తమకు అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి నిరసన వారం: ఏపీటీఎఫ్


సమావేశమైన ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కా రం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గు రువారం నుంచి నిరసన వారం చేపట నున్నట్లు జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గత ప్రభుత్వం అనేక హామీ లు ఇచ్చి ఉపాధ్యాయులకు రివర్స్ పీఆర్సీతో మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నా రు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30శాతం మధ్యంత భృతి ప్రకటించాలన్నారు. సీపీఎస్‌పై దాటవేత ధోరణి అవలంబిస్తోంద న్నారు. వెంకటాద్రి, గోపాల్, చంద్రశేఖర్, రామదాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఈశ్వరయ్యకాలనీలో ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 20మంది విద్యార్థులకు స్కూల్‌మేళా స్వచ్ఛంద సేవాసంస్థ బుధవారం సుమారు రూ.40వేల విలువైన బ్యాగులు, వాటర్ బాటి ళ్లు, గొడుగులు, దుస్తులు, నోట్‌పుస్తకాలు అందజేసింది. సంస్థ డివిజనల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆపన్న హస్తం అందిస్తే విద్యలో రాణిస్తారన్నారు. హెచ్‌ఎం పోతురాజు, ఉపాధ్యాయురాలు శిరీష పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న హుండీ ఆదాయం రూ.12.30 లక్షలు

నారాయణవనం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కించారు. 75 రోజులకు రూ.12,30,805 భక్తులు సమర్పించినట్టు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. పరకామణిలో ఏఈవో రవి, సూపరింటెండ్ ధర్మయ్యలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో క్షేత్ర సహాయకుల చేతివాటం

మంచానికి పరిమితమైన వారిపేరుతో మస్టర్లు ● పరిశ్రమల్లో కార్మికులకు వేతనాలు ● సామాజిక తనిఖీల్లో బట్టబయలు


విచారణ జరుపుతున్న డ్వామా పీడీ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలో ఉపాధి హామీ పనుల్లో క్షేత్రసహాయకుల చేతివాటం మరోసారి బయట పడింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధులతో పాటు సామాజిక భద్రత పింఛన్లు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఫారెస్ట్, సర్వశిక్షా అభియాన్‌లలో ఉపాధి పథకం కింద చేపట్టిన రూ.948.49 లక్షల పనులకు సం బంధించి ఎస్‌ఆర్‌పీ లోకేష్ ఆధ్వర్యంలో 13 మంది డీఆర్‌పీల బృందం మండలంలో పది రోజులుగా గ్రామాల్లో విచారణ చేపట్టింది. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీ డీవో ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ ప్రజా వేదికలో డ్వామా పీడీ శ్రీనివాస్ ముందు విచారణ నివేదికను తనిఖీ బృందం ఉంచింది. విచారణలో మంచానికి పరిమితమై ఫించన్ పొందుతున్న వారు, వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల పేరు మీద మస్టర్లు సృష్టించి, వేతనాలు చెల్లించి నిధులు దు ర్వినియోగం చేసినట్లు గుర్తిం చారు. చిన్నపాండూరులో మం చానికి పరిమితమైనట్లు ధృవీ కరణ పత్రాలు పొంది నెలకు రూ.15వేలు ఫించన్ పొందు తున్న వారు ఉపాధి పనులు చేస్తున్నట్లు గుర్తించి పీడీ విచా రణకు ఆదేశించారు. కళ త్తూరు పంచాయతీలో కంపెనీ లకు వెళ్లే కార్మికులు ఉపాధి పనులకు హాజరయినట్లు మస్టర్లు సృష్టించారు. అదే గ్రామంలో ఓ రెవెన్యూ సిబ్బంది ఉపాధి పనులు చేసినట్లు ఉండడం గుర్తించారు. పలు పంచాయతీల్లో కొలతలు, కూడికల్లో తేడాలు, రికార్డులను సక్రమంగా నిర్వహించక పోవడం, మస్టర్‌లలోని సంతకాలలో తేడాలు ఉండడం గుర్తించారు. తనిఖీల్లో వెలుగు చూసిన వివిధ అవకతవకలపై ఉపాధి సిబ్బంది నుంచి రూ.1.30 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏపీవో గణేష్ తీరుపై పీడీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పలువురు సిబ్బందికి రూ.26 వేల అసరాధం విధించారు. కార్యక్రమంలో ఏపీడీ సరిత, ఎస్టీఎం కోనయ్య, ఎస్‌ఆర్‌పీ లోకేశ్ పాల్గొన్నారు.

పుస్తకాల మాటున దాగి కాటేసిన పాము

డిగ్రీ కళాశాల ఉద్యోగికి అస్వస్థత



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుస్తకాల మాటున నక్కిన పాము గ్రంథాలయ ఉద్యోగిని కాటువేసింది. ఈ ఘటన శ్రీకాళహస్తి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల లైబ్రరీలో బుధవారం జరిగింది. కళాశాల లైబ్రరీలో రామయ్య ఉద్యోగి. బుధవారం పుస్తకాలను సర్దుతుండగా చేతిపై పాము కాటు వేయడం అస్వస్థతకు గురయ్యాడు. సహచర సిబ్బంది చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గడ్డివాము దగ్ధం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): గడ్డివాము దగ్ధమైంది. మండలంలోని కళత్తూరుకు చెందిన రైతు సురేష్‌రెడ్డికి చెందిన గడ్డివాములో బుధవారం హఠాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన రైతు అగ్ని మాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరకున్న శ్రీసిటీ అగ్ని ప్రమాద శాఖ అధికారులు, సిబ్బంది మంటలను అదుపులో తెచ్చారు. కాగా ఈ ఘటనలో రూ.1.50 లక్షలు గడ్డి కాలిపోయినట్టు రైతు తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో ఓజిలివాసి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

రేణిగుంట సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... తిరుపతి కాటన్ మిల్లు వెనక వైపు ఓ వ్యక్తి మృతి చెందిపడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరు కున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలిం చారు. మృతుడు ఓజిలి మండలం సంగు టూరుకు చెందిన వెంకటేశ్వర్లు(35)గా గుర్తిం చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రూయా ఆస్పత్రికి తరలించారు. అనుమానా స్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దోమలు చేరకుండా పరిస రాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి సూచించారు. బుధవారం ఆమె మండలంలోని కనమనంబేడులో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు.హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను శు భ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచిం చారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు కళాకారులకు పురస్కారాల ప్రదానం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 10(ఆంధ్ర జ్యోతి) : మహతి ఆడిటోరియంలో ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే రాయలసీమ రంగస్థలి నృత్య కళోత్సవంలో కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేయ నున్నట్లు రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కెఎస్.రాజా తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధ వారం ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవ రాయలు పేరుతో ఈ పురస్కారాలు ఇవ్వ నున్నట్లు పేర్కొన్నారు.

ఫారంపాండ్ రైతుల పాలిట వరం


ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెం బరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పంట సంజీవని, ఫారం పాండ్‌లు రైతుల పాలిట వరమని ఉపాధి హామీ పీడీ శ్రీని వాస ప్రసాద్ చెప్పారు. మండలం లోని వేణుగోపాలపురంలో ఉపాధి హామీ పనులను బుధవారం ఆ యన తనిఖీ చేశారు. కూలీల హాజ రు పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేస్తున్న కూలీలు నష్ట పోకుండా ఉండటం కోసం ఎన్‌ఎంఎంఎస్ హాజరు పట్టిలో 100శాతం పారదర్శకత పాటించాలన్నారు. పశువులు ఉన్న రైతులు పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మినీ గోకులాలకు నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఇళ్ల వద్ద ఉన్న వర్మీ కంపోస్టు పిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దేవరి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



గంగమ్మకు సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ - గంగమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

నింద్ర, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంతో పాటు పరిసరాల్లో ఉన్న 15 గ్రామాల్లో గంగ జాతర వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. నగరిలో డప్పు వాయి ద్యాలు, బాణసంచా పేలుళ్ల, సాంస్కృతిక కార్య క్రమాల నడుమ మంగళవారం రాత్రి పట్టణంలోని వేపాకు గుడిసెకు అమ్మవారు వేంచేశారు. టీటీడీ నాయకులు చేపట్టిన పుష్పాలంకరణ నడుమ గంగమ్మ దేదీప్యమా నంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. వెయ్యి కళ్ల దుత్తలు సమర్పిం చారు. డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించాయి. సాయంత్రానికి చావడి ప్రాంతం జన సమూహంతో కిక్కిరిసిపో యింది. మొక్కుబడితో విచిత్ర వేషధారణలో వచ్చిన భక్తులు సందడి చేశారు. బలి అన్నం సమర్పించే సమయంలో రద్దీ ఎక్కువైంది. రాత్రి గంగమ్మను డప్పు వాయిద్యాల నడుమ ఊరే గింపుగా తీసుకెళ్లి పొలి మేర దాటించారు.

● గంగమ్మ సేవలో ప్రముఖులు

గంగమ్మకు టీటీడీ సారెను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందించి వన దుర్గాదేవి అలంకర ణలో ఉన్న ఓరుగుంటాలమ్మను, మహిషాసుర మర్ధిని అలంకరణలో ఉన్న దేశమ్మను దర్శించు కున్నారు. అనంతరం మాజీ మంత్రి రోజా, గాలి జగదీష్, సినీ నటి మీనాక్షి దీక్షిత్ తదితరులు దర్శించుకున్నారు.



గంగమ్మ సేవలో మాజీ మంత్రి రోజా - సినీ నటి మీనాక్షి దీక్షిత్

డివైడరును ఢీకొన్న కారు: నలుగురికి గాయాలు

రేణిగుంట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): డివైడరును కారు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. బుధవారం మధ్యాహ్నం నగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ క్లర్క్ దినేష్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి నుంచి పుత్తూరుకు వెళ్తుండగా గాజులమండ్యం పాత పోలీస్ స్టేషన్ వద్ద డివైడరును ఢీకొన్నాడు. ఈ ఘటనలో దినేష్ తీవ్రంగా గాయపడగా, కుటుంబీకులకు స్వల్పగాయ్యాయి. స్థానికులు గుర్తించి వారిని ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా జనసేన


సోమయ్య కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జనసైనికులకు అండగా జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టెసాయి అన్నారు. మండలంలోని నారాయణపురానికి చెందిన జనసేన క్రియాశీల సభ్యుడు సోమయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ ఆదేశాల మేరకు ఆయన కుటుంబానికి రూ.5లక్షలు ప్రమాదబీమా చెక్కును అందజేశారు. కుమార్, మహేష్, గరికపాల చంద్రశేఖర్, విజయకుమార్, చిరంజీవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



వరదయ్యపాళెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని బత్తల వల్లం జడ్పీ హైస్కూల్ విద్యా ర్థులకు గ్రామానికి చెందిన గిరిరెడ్డి రూ.12వేల విలువైన క్రీడా దుస్తులను వితరణ చేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయసుధ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పీఈటీ బందెల కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘ బ్యాంక్ చైర్మన్‌గా షణ్ముగం



నారాయణవనం, సెప్టెం బర్ 10(ఆంధ్ర జ్యోతి): నారాయణవనం మండల వ్యవ సాయ సహకార సం ఘ బ్యాంక్ చైర్మన్‌గా తిరు పతి షణ్ముగం, డైరెక్టర్లుగా సముదాయం పంచాయతీకి చెందిన పొన్నుస్వామి యాదవ్, అరణ్యంకండ్రిగ పంచాయతీకి చెందిన కిలారి విజయ్‌కుమార్ ఎన్నికైనట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గిరిబాబు తెలిపారు. త్రిమన్ కమిటీని టీడీపీ నాయకులు అభినందించారు.

వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నిరంజన్‌రెడ్డి



సత్యవేడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సత్యవేడుకు చెందిన ఆ పార్టీ మాజీ మండల కన్వీనర్ కే.వీ.నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు అందినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత జగన్‌కు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నాగ హారతితో ముగిసిన పుట్టాలమ్మ జాతర

రేణిగుంట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కట్ట పుట్టాలమ్మ జాతర నాగ హారతితో ముగిసింది. బుధవారం రెండో రోజు పుట్టాల మ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మధ్యా హ్నం ఆలయం నుంచి నాగపడగను మేళా తాళాలతో దొడ్లమెట్లకు ఊరేగించారు. ఆలయ వంశపారంపర్యులు పడకకు ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం అక్కడినుంచి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం నాగపడగను అమ్మవారికి హారతి సమర్పించ డంతో జాతర ముగిసింది. అంతకు ముం దుగా తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి అమ్మవా రిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాడి రాజేంద్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుజాతకు యోగా జ్యోతి అవార్డు


అవార్డు అందుకుంటున్న సుజాత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బెంగళూరులోని రోటరీ బెంగళూరు గ్లోబల్ యోగా, రోటరీ క్లబ్ ఆఫ్ బెంగళూరు కల్యా ణ్, యోగా యూనివర్శిటీ ఆఫ్ అమెరికన్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన యోగా గురువు అయిలం సుజాతకు యోగా జ్యోతి అవార్డును ప్రదానం చేశారు. ఆమె మాట్లా డుతూ గౌరవ ప్రదమైన ఈ అవార్డు సాధించడం శ్రీకాళహస్తివాసిగా ఎంతో ఆనందంగా ఉందన్నారు.

పాఠశాలల్లో రాజకీయ జోక్యం తగదు

● సీఐటీయూ

సత్యవేడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజా ప్రతినిదుల జోక్యం తగదని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. మండలంలోని దాసు కుప్పం పంచాయతీ చెన్నేరి ప్రాథమిక పాఠ శాలలో ఐదేళ్లనుంచి పారిశుధ్య కార్మి కురాలిగా పని చేస్తున్న సిలార్‌బీని నిలిచి పోవాలంటూ సర్పంచ్ రవిరెడ్డి హెచ్చరిస్తు న్నారని ఆరోపించారు. సర్పంచ్ తనకు అనుకూలమైన వారిని పనిలో పెట్టేందుకు ప్రస్తుతం పని చేస్తున్న మహిళ స్థానికురాలు కాదని చెప్పడం శోయనీయమన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పారిశుధ్య కార్మికురాలను తొలగించ వద్దని సూచించారు.